Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 27 పేజీలు 8 వెల : 5 శనివారం 12 జూలై 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్లాక్ & వైట్ పేజి |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.





# జిఎస్టీ వసూళ్లలో రోల్ మాడల్‌గా ఉండాలి

## పన్ను వసూళ్లలో పారదర్శకత ఉండాలి

## అధికారులకు సిఎం చంద్రబాబు సూచన

**అమరావతి:** జీఎస్టీ వసూళ్లలో దేశానికి ఏపీ రోల్‌మోడల్‌గా ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. సమర్థమైన పన్ను వసూళ్ల ప్రక్రియ ద్వారా జాతీయ సంపదను పెంచాలని.. దాన్ని ప్రజల సంక్షేమం, అభివృద్ధికివినియోగించాలన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కేంద్ర-రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. డేటా అనలిటిక్స్‌లాంటి సాంకేతికతను వినియోగించి పన్ను ఎగవేతలను అడ్డుకోవాలని అధికారులకు సూచించారు. జీఎస్టీ రియలైజేషన్ కోసం కేంద్ర-రాష్ట్ర అధికారుల మధ్య సమాచార సమన్వయం ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. జీఎస్టీ వసూళ్లకు సంబంధించి పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేలా కార్యాచరణ ఉండాలన్నారు. ఎగవేతలను గుర్తించేందుకు విద్యుత్ వినియోగం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్లలో ఎక్కడా పొరపాటు జరగకుండా చూసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎలాంటి పన్ను ఎగవేతలకు అవకాశం లేకుండా చూడాలని జీఎస్టీ అధికారులకు సీఎం దిశానిర్దేశర చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లలో 3.4 శాతం వృద్ధి నమోదైందని అధికారులు ఆయనకు వివరించారు. త్వరలోనే విశాఖ, విజయవాడల్లో ఏర్పాటు- కానున్న జీఎస్టీ -ట్రైబ్యునళ్ల ద్వారా పన్ను వివాదాలు పరిష్కారమవుతాయని తెలిపారు. సెంట్రల్ జీఎస్టీ జోనల్ కార్యాలయం, క్వార్టర్ల నిర్మాణం కోసం అమరావతిలో 5 ఎకరాల భూమి కేటాయించాలని కేంద్ర అధికారులు సీఎంకు విన్నవించారు.



2లో..

# మరింత ఉన్నతంగా తిరుమల శ్రీవారి సేవ

గ్రూప్ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ

టిటిడి ఇవో శ్యామలరావు వెల్లడి

# రాష్ట్రంలో రైతులను పట్టించుకోని ప్రభుత్వం



2లో..

దయనీయంగా ఉన్నా అండగా నిలవని కూటమి

రు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా వ్యవహారం

జగన్పరామర్శలకు వెళితే తట్టుకోలేని పెద్దలు

మాజీమంత్రి, వైకాపానేత పేర్నినాని విమర్శలు



2లో..

# మాదంతా టీమ్ వర్క్

అంతా కలసి ముందుకు సాగుతున్నాం: భట్టి




2లో..

హిందీ నేర్చుకోవడంతో లాభమే తప్ప నష్టం లేదు

హిందీ దివస్ కార్యక్రమంలో డిప్యూటి సిఎం పవన్

# హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు

# బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్.. రైల్ రోకో వాయిదా



2లో..

బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ ప్రకటన

రైల్‌రోకో వాయిదా వేస్తున్నట్లు కవిత వెల్లడి

ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బంది పడుతున్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయి. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్నందున భాజపా అనుకుంటే ఒకే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదు.. కానీ ఇవ్వడం లేదు. దోషమంతా కాంగ్రెస్‌పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమో. ప్రజలు గమనిస్తున్నారు



2లో..

ఢిల్లీలో వరుసగా రెండోరోజూ

# ప్రకంపనలు

ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, భివానీ, ఝుజ్జర్, బహదూర్‌గఢ్ సహా అనేక నగరాల్లో భూకంప ప్రకంపనలు సంభవించాయి. భూకంపం హర్యానాలోని ఝుజ్జర్ కేంద్రంగా భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైనట్లు- అధికారులు అంచనా



# భద్రాద్రి ఇవోపై దాడి దుర్మార్గం

ఘటనపై బిజెపి స్పందించకపోవడం దారుణం: కెటిఆర్

హైదరాబాద్: ఇవోపై దాడిని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి దేవస్థాన భూముల్లో జరుగుతున్న ఆక్రమణలను, పక్కా భవన నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పైనా, 30 మంది సిబ్బందిపైనా ఆ గ్రామస్తులు మంగళవారం కర్రలతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. భద్రాద్రి ఆలయ ఈవోపై దాడి జరిగిన ఘటనపై బీజేపీ రాచమంద్రా నోరు తెరవరేం..? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాములోరి భూములను ఆక్రమించుకుంటోంటే మాటైనా మాట్లాడరేం? మీ భాగస్వామి ప్రభుత్వం చెరలో ఉన్నాయని వదిలేస్తున్నారా? లేక ఈసారి మొత్తం భద్రాద్రినే గంపగుత్తగా వారి చేతిలో పెడదామనుకుంటున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఓట్ల కోసమే చేసే మీ రామజపాలను, సీట్ల కోసమే వేసే మీ దొంగ నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. మోదీతో మాట్లాడతారో, మీ దోస్తు దగ్గర మోకరిల్లుతారో మీ ఇష్టం.. భద్రాద్రిని కాపాడండి.. ఆక్రమణల చెర నుంచి విడిపించండి అని కేటీఆర్ పేర్కొన్నారు.



2లో..

# బిసి రిజర్వషన్లతో నీకేం సంబంధం

నీవెందుకు రంగులు పూసుకుంటున్నావు

కవిత ప్రకటనలపై పిసిసి చీఫ్ ఎద్దేవా

ఆమె ఉద్యమిస్తే మేం ఆర్డినెన్స్ తెచ్చామా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేళ్లు ఏం వెలగబెట్టారని ఆమె బీసీ పాట పాడుతున్నారు. బీసీ రిజర్వేషన్లు రాహుల్ అజెండా, రేవంత్ నిబద్ధత అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు

# మాదంతా టీమ్ వర్క్

**అంతా కలసి ముందుకు సాగుతున్నాం: భట్టి**



న్యూఢిల్లీ: తెలంగాణలో సమర్థంగా ప్రభుత్వ పనితీరు ఉందని, పథకాల అమలు సాగుతోందని తెలంగాణ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సిఎం రేవంత్ సహా మంత్రులంతా టీమ్ వర్క్ చేస్తున్నారని అన్నారు. కర్ణాటక తరహాలో తమ ప్రభుత్వంలో పవర్ షేరింగ్ అంటూ ఏమీ లేదని భట్టి విక్రమార్క అన్నారు. అందరం కలిసి టీం వర్క్ చేస్తున్నామని చెప్పారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి నేతల మాటలు మితిమీరి పోయాయి. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు.. జనాల్లోకి వెళ్లడం లేదు. రూ. రెండు లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయొద్దన్నది మా ప్రభుత్వ విధాన నిర్ణయం. రేషన్‌కార్డు ఆధారంగానే రుణమాఫీ చేశాం. సన్నం బియ్యం సక్సెస్ అయ్యింది. గతంలా పక్కదారి పట్టడం లేదు. ఉచిత బస్సుకు మహిళల నుంచి మంచి స్పందన ఉంది. మరో 3వేల బస్సులు కొనుగోలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఫోర్త్ సిటీ- పనులు జరుగుతున్నాయి. మూసీ సుందరీకరణ ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతుంది. గాంధీ ఘాట్ వరకు సుందరీకరణ జరిగి తీరుతుంది. దీనికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తుంది. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చే అవకాశం లేదు. సిగాచీ ప్రమాదంపై విచారణకు ఆదేశించాం. ఇటీ-వల జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కేసీ వేణుగోపాల్ ప్రభుత్వ తీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు' అని భట్టి విక్రమార్క తెలిపారు.

# రాష్ట్రంలో రైతులను పట్టించుకోని ప్రభుత్వం

అమరావతి: రాష్ట్రంలో రైతులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గిట్టుబాటు ఇవ్వడం లేదని వైసీపీనేత మాజీమంత్రి పేర్ని నాని మండిపడ్డారు. ఏపీలో రైతుల పరిస్థితులు దయనీయంగా ఉండటం సమాజానికి విచారకరం అన్నారు. రైతుల వద్దకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ వెళ్తే ఏడుస్తారు అని కూటమి ప్రభుత్వంను విమర్శించారు. ఏపీలో రైతుల పరిస్థితులు దయనీయంగా ఉండటం సమాజానికి విచారకరం అని పేర్కొన్నారు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా కూటమి ప్రభుత్వ వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి జగన్ గారిని తిట్టడానికి తప్ప ఎక్కడైనా తిరిగారా? అని పేర్ని నాని ప్రశ్నించారు. శుక్రవారం అమరావతిలో మాజీమంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, కోకో.. తాజాగా మామిడి పంటలు పండుతున్న రైతుల కడగండ్లు ప్రభుత్వానికి కనిపించటం లేదు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా కూటమి ప్రభుత్వ వ్యవహారం. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అర్థం ఏంటి?. ముందు నుంచి ఒకరు.. వెనుక నుంచి మరొకరు కోస్తారని అర్థమా?. రైతుల గోడు పట్టించుకునే నాధుడు లేదు. వ్యవసాయ శాఖ మంత్రి జగన్‌ను తిట్టడానికి తప్ప ఎక్కడైనా తిరిగారా?. హామీలు ఇచ్చిన మూడు పార్టీల్లో ఇద్దరు అవునంటారు.. మరొకరు తెలియదు అంటారు. వ్యవసాయ శాఖ మంత్రి రైతుల బాధలు పట్టించుకుంటు-న్నారా?. మిర్చి, పొగాకు రైతుల బాధలు చూడటానికి వెళ్తే సినిమా సెట్టింగుల యాత్రలు అంటారు. జగన్ వెళ్తుంటే విమర్శిస్తారు.. మీరు వెళ్ళి చూస్తుంటారు. మిర్చి యార్డు ఉన్న కేంద్ర మంత్రి రైతుల కోసం వెళ్లారా?. ఒక్క ఎమ్మెల్యే అయినా రైతుల కోసం వెళ్లారా?. మీరు పట్టించుకోరు, రైతులకు గిట్టు-బాటు- ఇవ్వరు.. జగన్ వెళ్తే ఏడుస్తారు' అని పేర్ని నాని మండిపడ్డారు. పొగాకు రైతుల కోసం జగన్ వెళ్తే ఒక 20 మంది పచ్చ మూకలను పంపిస్తారు. వాళ్లకు డబ్బులు ఇచ్చి పంపిస్తారు. మీ టీ-వీ డిబేట్లలో డబ్బులు ఇచ్చి జగన్‌ను తిట్టిస్తారు. జగన్‌ను తిట్టకుండా ఒక్క డిబేట్ ఉంటు-ందా?. మీరు వచ్చినప్పటి నుంచి చేసిందేమీ లేదు కాబట్టి.. జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టు-కున్నారు. ఉదయం, సాయంత్రం మీ వ్యాపారం మొత్తం జగన్ మీదే కదా.



ఇవాళ మామిడి రైతుల గురించి ఇష్టం వచ్చినట్లు- మాట్లాడుతున్నారు. జగన్ పర్యటనకు హెలెక్రాప్టర్కు పర్మిషన్ ఇవ్వరు. తప్పుడు మాటలు.. విష ప్రచారం.. అసత్యాలు మాట్లాడుతున్నారు. జగన్ బంగారుపాళ్యం వెళ్తున్నారని కేబినెట్లో తీర్మానం చేస్తారు. వీళ్లకు అబద్దాల ప్రచారం తప్ప మరొకటి లేదు. 9వ తేదీ జగన్ వెళ్ళగానే 260 కోట్లు- విడుదల చేశామన్నారు.. జీవో వచ్చిందా. ఎవరి-కై-నా సమాచారం ఉందా?. ఒక్క మామిడి రైతుకన్నా న్యాయం చేశారా. రైతు కష్టం గురించి తెలియని వాళు ్ర.. విచిత్రమైన వ్యవసాయ శాఖ మంత్రి 80 శాతం కొనేసాము అంటారు. మరో మంత్రి 90 శాతం కొన్నారని అంటారు.. ఎవరిది నిజం' అని పేర్ని నాని ఫైర్ అయ్యారు. జగన్ వెళ్తున్నారని.. వాడు, వీడు అంటున్నాడు. మిమ్మల్ని వాడు, వీడు అనలేమా. జగన్ ఎప్పుడు కూడా వాడు, వీడు అని శత్రువుల గురించి కూడా మాట్లాడరు. అమ్మఒడి అందరికీ వేశామని చెప్పారు.. లక్ష మందికి అయినా 13 వేలు పడ్డాయా. ఈ దిక్కుమాలిన ప్రభుత్వం దగ్గరి నుంచి ఎలా వంచించాలో నేర్చుకోవాలి. 6.50 లక్షల టన్నుల పంట పండింది. 80 శాతం కొన్నామని వ్యవసాయ శాఖ మంత్రి.. 90 శాతం కొన్నామని సివిల్ స్లపై మంత్రి చెబుతారు. కలెక్టర్ మాత్రం 67 శాతం అని చెప్పారు. ఒక్క రైతు దగ్గరకు వెళ్లని వ్యవసాయ మంత్రి 80 శాతం కొనేసామని చెప్పారు.. సివిల్ స్లపై మంత్రి 90 శాతం అంటారు. మీ అబద్ధాలకు పోయే కాలం రాదా. ఫైనాన్స్ కాన్కరెన్స్ లేకుండా జీవో ఫైల్ జెనరేట్ చేశారు. ఏమీ చేయకుండా మమ అనేశారు' అని పేర్ని నాని విమర్శించారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు

**హామీని అమలు చేస్తున్న ప్రభుత్వం మాది: పొన్నం**

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని నిర్ణయించినట్లు- బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీల నోటి వద్ద ముద్ద లాక్కోవద్దని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. భాజపా బలహీన వర్గాలకు వ్యతిరేకమన్నారు. రాష్ట్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకదాని తర్వాత ఒకటి చేసుకుంటూ వెళ్తున్నాం. కులగణన నుంచి రిజర్వేషన్ల పెంపు వంటివి చట్టం చేసి కేంద్రానికి పంపే వరకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు- డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రివర్గ సహచరులు అందరం కృషి చేశాం. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి 42శాతం రిజర్వేషన్ల వరకు ఎక్కడా కాంగ్రెస్ పార్టీ తగ్గలేదు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యాయి. ఎవరూ అడ్డుపడొద్దు'అని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు.

# హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు

హైదరాబాద్: విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాల కోసం భాషతో సంబంధం లేకుండా ముందుకెళ్తున్న ప్రస్తుత రోజుల్లో హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అలా చేయడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఏర్పాటు- చేసిన రాజ్య భాషా విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకలకు పవన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హిందీ భాషపై ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం.. బలవంతంగా.. రాష్ట్రాలపై హిందీని రుద్దే ప్రయత్నం చేస్తుందని ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి.. అయితే, ఈ తరుణంలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. హైదరాబాద్‌లో నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొని హిందీ దివస్ శు భాకాంక్షలు తెలిపిన ఆయన.. హిందీని ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అని వ్యాఖ్యానించారు.. మన దేశం





వివిధ సంస్కృతులు ఉంటాయి.. అందరినీ హిందీ ఒక కామన్ భాషగా కలుపుతుందన్నారు.. విదేశస్తులు మన భాష నేర్చుకుంటారు.. మనం హిందీ అంటే ఎందుకు భయపడాలని ప్రశ్నించారు. హిందీ జబర్దస్త్ వస్తువు ఏమీ కాదు.. జర్మనీ, ఇతర భాషలు నేర్చుకుంటున్నాం.. కానీ, హిందీతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.. హిందీ మనది అనడంలో సిగ్గు ఎందుకు..? హిందీ నీ ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అన్నారు పవన్ కల్యాణ్.. బెంగాలీ గీతం జాతీయ గీతం అయింది.. అబ్దుల్ కలాం మిస్సైల్ మన్ అయ్యారు.. దక్షిణ భారత దేశస్తుడు చేసిన జెండా భారత జెండా అయింది.. ప్రతీ భాష జీవ భాష.. రాష్ట్ర భాష హిందీ.. రాష్ట్ర భాష హిందీని స్వాగతిస్తున్నారు.. మాతృ భాష మన అమ్మ భాష అయితే.. పెద్దమ్మ భాష హిందీగా అభివర్ణించారు.. హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని పరిమితం చేయడమే అవుతుందన్నారు పవన్ కల్యాణ్.. ఉర్దూను, పర్షియన్ ను అంగీకరించి.. హిందీని వ్యతిరేకించడం అవివేకం అవుతుందన్నారు.. 31 శాతం సినిమాలు హిందీ లో డబ్ అవుతున్నాయి.. వ్యాపారానికి హిందీ కావాలి.. కానీ, నేర్చుకోవడానికి అభ్యంతరం ఎందుకు? అని నిలదీశారు పవన్ కల్యాణ్.. హిందీలో డబ్ అయిన 31 శాతం సౌత్ ఇండియన్ సినిమాలు ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. వ్యాపారానికి హిందీ కావాలి కానీ, నేర్చుకోవడానికి ఎందుకు ఇబ్బంది. హిందీ నేర్చుకోవడమంటే మన ఉనికిని కోల్పోవడం కాదు. ఇంకో భాషను అంగీకరించడమంటే ఓడిపోవడం కాదు.. కలిసి ప్రయాణించడం' అని పవన్ కల్యాణ్ అన్నారు. వేడుకల్లో భాగంగా దక్షిణ సంవాదం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఢిల్లీలో వరుసగా రెండోరోజూ ప్రకంపనలు



న్యూఢిల్లీ:ఢిల్లీలో మరోసారి భూకంపం వచ్చింది.శుక్రవారం ఢిల్లీ ఎన్ సీఆర్ లో భూప్రకంపనలు సంభవించాయి. దీంతో జనం ఇండ్లలోంచి బయటికి పరుగులు పెట్టారు. భూకంప హర్యానాలోని ఝజ్జర్ కేంద్రంగా 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని నేషనల్ సెంటర్ ఆఫ్ సిస్మోలజీ (కఈ÷ూ) తెలిపింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.ఈ వారంలో ఈ ప్రాంతాన్ని తాకిన రెండవ భూకంపం ఇది. గురువారం కూడా దేశ రాజధాని ఢిల్లీలో భూకంపం జనానాలను భయభ్రాంతులకు గురి చేసింది.ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, భివానీ, ఝజ్జర్, బహదూర్‌గఢ్ సహా అనేక నగరాల్లో భూకంప ప్రకంపనలు సంభవించాయి. భూకంపం హర్యానాలోని ఝజ్జర్ కేంద్రంగా భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైనట్లు- అధికారులు అంచనా వేశారు.

# మరింత ఉన్నతంగా తిరుమల శ్రీవారి సేవ



తిరుమల: సీఎం చంద్ర బాబు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేం దుకు కృషి చేయాలని టిటిడి ఇవో శ్యామలరావు అన్నారు. శ్రీవారి సేవ స్వచ్ఛంద వ్యవస్థలో తీసుకురానున్న సంస్కరణలపై తితిదే ఈవో శ్యామలరావు సమీక్ష నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో అధికారులతో సమావేశమయ్యారు. త్వరలో ప్రారంభించనున్న ప్రొఫెషనల్, ఎన్ఆర్ఐ, గ్రూప్ సూపర్‌వైజర్ సేవల కార్యాచరణ పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఐఐఎం అహ్మదాబాద్ బృందంతో గ్రూప్ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఈవో ఆదేశించారు. గ్రూప్ సూపర్‌వైజర్ల కోసం రూపొందించిన అప్లికేషన్‌ను ఐటీ- విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎన్ఆర్ఐ సేవ, ప్రొఫెషనల్ సేవలను కూడా త్వరితగతిన ప్రారంభించాలని, ఎన్ఆర్ఐ సేవలను విస్తరించేందుకు ఏపీ ఎన్ఆర్టీ- సంస్థతో సంప్రదింపులు జరపాలని అధికారులను ఈవో ఆదేశించారు. మరోవైపు తిరుమలలో భద్రతా ప్రణాళికలపైనా ఈవో సమీక్ష నిర్వహించారు. భక్తుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎల్అండ్‌టీ- సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. భద్రతా వ్యవస్థను మరింత ఆధునికీకరించడంపై ఎల్అండ్‌టీ- ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మరో 40 ఏళ్లకు సరిపడా ప్రణాళికలు రూపొందించాలని వారికి ఈవో సూచించారు.

# బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్.. రైల్ రోకో వాయిదా



రైల్‌రోకో వాయిదా వేస్తున్నట్లు కవిత వెల్లడి

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. ఆర్డినెన్స్ తీసుకునిరావడాన్ని తెలంగాణ బీసీ బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. బీసీ బిల్లును షెడ్యూల్-9లో పెట్టాలి. దీనికోసం బీసీ బిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలి. ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పినందున ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనిస్తాం. దీనిపై ముందుకెళ్లకపోతే రైల్ రోకో చేపడతాం అని కవిత అన్నారు. అంతకుముందు బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి జాగృతి శ్రేణులతో ర్యాలీగా లోయర్ ట్యాంక్‌బండ్‌కు వెళ్లారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె నివాళుల ర్పించారు. స్థానిక ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని అన్నారు. అయితే మాకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయి. ఆర్డినెన్స్ ఇచ్చి వెంటనే రిజర్వేషన్లు అమలు చేయగలిగితే అధికారంలోకి వచ్చిన 18 నెలలు ఎందుకు ఆగారని అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని మేం భావిస్తున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బంది పడుతున్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయి. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్నందున భాజపా అనుకుంటే ఒకే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదు.. కానీ ఇవ్వడం లేదు. దోషమంతా కాంగ్రెస్‌పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమోనని, అయితే దీనిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

# బిసి రిజర్వేషన్లతో నీకేం సంబంధం

హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని టీ-పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ నిర్ణయం వెనక ఖర్గే, రాహుల్‌గాంధీ ఆశయం ఉందని చెప్పారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరోసారి నిరూపితమైందని చెప్పారు. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేస్తోందని వివరించారు. అయితే బీసీ రిజర్వేషన్లకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవితకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. మేం చేసిన దానికి ఆమె క్రెడిట్ తీసుకోవడమేంటని, కవితను చూసి జనాలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఆమె ఉద్యమిస్తే మేం ఆర్డినెన్స్ తెచ్చామా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేళ్లు ఏం



వెలగబెట్టారని ఆమె బీసీ పాట పాడుతున్నారు. బీసీ రిజర్వేషన్లు రాహుల్ అజెండా, రేవంత్ నిబద్ధత అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు కవితకు రాజకీయంగా ఎక్కడా చోటు లేకపోవడంతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు కాంగ్రెస్ మేలు చేస్తే కవిత ఎందుకు రంగులు పులుముకుంటుందని ప్రశ్నించారు. కవితకు, భవితకు సంబంధం లేదని అన్నారు. రాహుల్ గాంధీ ఆదేశం మేరకు రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను వంచించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు తగ్గించిన ఘనత కేసీఆర్ దని అన్నార. కేసీఆర్ కూతురైన కవిత పండుగ చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ నేతలు ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా ఇచ్చిన హామీని నిలబెట్టు-కుందని చెప్పారు. బీసీల విషయంలో చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నట్టు- చెప్పారు.


# ఆపరేషన్ సింధూర్‌పై విదేశీ మీడియా దుష్ప్రచారం

**భారత్‌పై పాక్ దాడికి ఒక్క ఆధారమైనా చూపగలరా**

**లక్ష్యాలను ఛేదించడంలో భారత్ అసమాన ప్రతిభ**

**ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో అజిత్ ధోవల్**

చెన్నై,జులై: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాలు విసిరారు. చెన్నైలోని ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో డోభాల్ మాట్లాడుతూ, పాకిస్థాన్ లోపలకు వెళ్లి విజయవంతంగా 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులు జరిపిందని, ఒక్క టార్గెట్ కూడా మిస్ కాలేదని చెప్పారు. ఉగ్రవాదులు ఎక్కడున్నారనే కచ్చితమైన సమాచారంతో ఈ దాడులు జరిపామని చెప్పారు. భారతదేశ



ఇంటెలిజెన్స్, కార్యాచరణ కచ్చితత్వాన్ని ఈ మిషన్ చాటిచెప్పిందని అన్నారు. కేవలం 32 నిమిషాల్లో ఈ ఆపరేషన్ పూర్తి చేసినట్టు- చెప్పారు. భారతదేశ వ్యూహాత్మక ఆపరేషన్ విశ్వసనీయతను ప్రశ్నించే వారు భారత్ వైపు నష్టం జరిగిందని చెప్పే ఒక్క ఫోటోనైనా చూపించాలని సవాలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు. సోషల్ మీడియాలో విదేశీ వార్తాసంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను డోభాల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది.. ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు. ఆ దేశంలో ఉగ్రస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయనే అత్యంత కచ్చితమైన సమాచారంతోనే భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. పాకిస్థాన్‌లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి కానీ.. భారత్‌కు నష్టం జరిగినట్లు ఒక్క ఫొటో కూడా లేదని వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన ఆయుధ స్థావరాలపై దేశ సైన్యం చిన్నగీత కూడా పడనివ్వలేదని అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను, యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన సాధన సంపత్తిని దేశీయంగానే రూపొందిస్తోందని డోభాల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయ న్నారు. పాకిస్థాన్ సైన్యం దిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు... గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే సమర్థమంతంగా పేల్చివేశాయని తెలిపారు.

Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

ఉత్తేజిత

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

దినపత్రిక

## సంపాదకీయం

# మానవ వనరుల

## వినియోగంలో వైఫల్యం !

జనాభా పెరుగుదల అన్నది అభివృద్ధికి సూచిక కానేకాదు. జనాభా వల్ల వనరులు తగ్గుతాయి. ఆర్థిక భారం పడుతుంది. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో జనాభా వల్ల ఖజానాపై అత్యధిక భారం పడుతుంది. ఎందుకంటే వీరందరికి పెన్షన్లు ఇవ్వాలి.కిలోరూపాయి బియ్యం పథకం అమలు చేయాలి. ఇంట్లో ఎందరు ఉంటే అంతమందికి బియ్యం ఇవ్వాలి. ఎందరుంటే అంతమందికి పెన్షన్లు ఇవ్వాలి. వీరుమాత్రం దర్జాగా ప్రభుత్వ పథకాలతో కాలక్షేపం చేస్తూ బలాదూర్‌గా తిరుగుతున్నారు. ఇప్పటికే ఏ రంగంలోనయినా కూలీల కొరత తీవ్రంగా ఉంది. జనాభా ఉన్నాకూలీలు దొరకని దేశం ఒక్క భారత్ మాత్రమే అయివుంటుంది.

జనాభాను ఉపయోగించి వస్తూత్పత్తి చేసి, ఎగుమతులు చేయడం ద్వారా పటిష్ట ఆర్థిక విధానాలు అమలు చేసే ప్రణాళికలు భారత దేశంలోని ప్రభుత్వాల వద్ద లేవు. చైనాలాంటి దేశాలు అధిక జనాభాను కూడా ఆర్థిక ఉత్పత్తికి కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నాయి. ప్రజలందరికి పని కల్పించి, వారితో వస్తూత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు. దాంతో విదేశాలకు ఎగుమతులు పెంచి ఆర్థికంగా బలపడుతున్నారు. కానీ భారత్‌లో అది సాధ్యం కావడం లేదు. ఇప్పటికే వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. పనులు చేసేందుకు ఎవ్వరూ ముందుకురావడంలేదు. పనిచేయకున్నా పస్తులుండే పరిస్థితులు లేవు. ఎందుకంటే ప్రభుత్వం ఏదోరకంగా ఏదో ఒక పథకంతో ఆదుకుంటోంది. లేదా రాజకీయ పార్టీల జెండాలు మోస్తే వారే మందు, బిర్యానీలు సరఫరా చేస్తుంటారు. ఇలా మానవవనరులను వృధా చేసుకుంటున్న ఏకైక దేశం భారత్ మాత్రమేనని చెప్పడంలో వెనకాడాల్సిన పనిలేదు. దీనికంతటికీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అందువల్ల వారు పనిచయడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వ పథకాలు ఏవేవి వస్తున్నాయో లెక్కలు కట్టి మరీ రాబట్టు కుంటున్నారు. దీంతో వారు కాయకష్టం చేయడానికి ఇష్టపడడం లేదు. భారతదేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా ప్రతిరంగంలోనూ కార్మికుల కొరత ఉంది. అందరూ వైట్ కాలర్జాబ్‌లే చేయాలనుకుంటున్నారు. స్వయం ఉపాధి రంగాలపై శ్రద్ధ చూపడం లేదు. ఆయా రంగాలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉండడం లేదు. ఉదాహరణకు కోళ్ల పెంపకానికి డిమాండ్ ఉంది. అలాగే పాడిపరిశ్రమకునిత్యం డిమాండ్ ఉంది. గొర్రెలు, చేపల పెంపకానికి కూడా డిమాండం ఉంది. ఈ రంగాల్లో స్వయం సమృద్ధితో ఉపాధి పొందవచ్చు. కానీ యువత అందుకు సిద్దంగా లేదు. ఈ క్రమంలో జనాభా పెరగాలని రష్యా లాంటి దేశాలు ఆరాటపడు తున్నాయి. భారత్ లాంటి దేశాలు వద్దు బాబోయం అంటున్నాయి. కొన్ని దేశాలు ఇప్పటికే అధిక జనాభాతో సతమతమవుతూ..జనాభా నియంత్రణ చర్యలు పాటిస్తున్నాయి. మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు ఆ నిబంధనను సడలిస్తున్నాయి. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల పరిస్థితులు కూడా ఇలాగే ఉన్నాయి. జనాభా పెరగాలని ఏపి సిఎం చంద్రబాబు లాంటి వారు కోరుకుంటున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యమిస్తుండగా, దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు కారణమని తెలుస్తున్నది. జనాభా పెరగాలంటున్న చంద్రబాబు లాంటి వారివద్ద సరైన ప్రణాళికలు లేవు. ఉన్న జనాభాను ఎలా వినియోగిం చుకోవాలో తెలియదు. ఇప్పటికే ఖజానా భారంగా మారినా ఊరూరా పెన్షన్ల పంపిణీని జాతరలా కొనసాగి స్తున్నారు. ఇదంతా

కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేస్తున్నదే తప్ప మరోటి కాదు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే దేశంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు. వస్తూత్పత్తని పెంచవచ్చు. వ్యవసాయక దేశమైన భారత్‌లో తిండిగింజలను పండించవచ్చు. వనరులను ఉపయోగించుకుని వ్యవసాయంలో ఆర్థిక విప్లవం తీసుకుని రావచ్చు. కానీ ఇలా ఆలోచన చేసే నేతలు దేశంలో లేరు.140 కోట్ల జనాభాతో ప్రపంచంలో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణంపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది. వనరులను దెబ్బతీస్తుంది. పర్యావరణ విధ్వంసానికి కారణం అవుతుంది. అయితే సమర్థవంత మైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు. జనాభాను ఉపయోగించుకోవడం అన్నది నేతల సమర్థతకు పరీక్ష లాంటిది. అధిక జనాభా ఉన్నా కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో అభివృద్ధిపథంలో దూసుకు పోతున్నాయి. అందుకు చైనా మన కళ్లముందు కనిపిస్తున్న ఉదాహరణ. అధిక జనసాంద్రత ఉన్నప్పటికీ సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. ప్రపంచంలో జనసాంద్రత పరంగా సింగపూర్ మూడో స్థానంలో ఉంది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు కాగా, చదరపు కిలోమీటర్‌కు 8,595 మంది నివసిస్తున్నారు. అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా ఉంది. జనసాంద్రత పరంగా చైనా ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని అమలు చేసి, దాదాపు 40 కోట్ల జనాభాను నియంత్రించింది. ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతం గా ఉపయోగించింది. ఫలితంగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో 35 ఏళ్లలోపు యువ జనాభా 65 శాతం ఉంది. ఈ జనాభాను పనివిధానంలోకి మారిస్తే అద్భుతాలు సాధించవచ్చు. ఇది సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడు తుంది. ఎగుమతి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. అయితే ఇప్పటి వరకు ఏ రాష్ట్రం లేదా కేంద్రం ఇలాంటి ఆలోచనలు చేయలేదు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధానం కనుక అటువైపే ప్రణాళికలు ఉంటున్నాయి. ఈ దుస్థితి పోవాలంటే జనాభాను తగ్గించుకోక తప్పదు.

## ఎక్సైజ్ పోలీసులు నాటు సారా స్థావరాలపై దాడులు

## 90 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు జూలై 11 :



నందికొట్కూరు పట్టణంలోని షికారి పేటలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన బెల్లము ఊట ధ్వంసం, ఒకరు అరెస్ట్ రిమాండ్ కు తరలింపు. కర్నూలు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దేవిఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్ రవికుమార్ సూచనల మేరకు నందికొట్కూరు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు ఎక్సైజ్ సిబ్బందితో కలిసి నందికొట్కూరు పట్టణంలోని షికారిపేటలో ని దాడులలో షికారి సుగుణ (54) మహిళఇంటిలో నాటుసారా తయారు చేస్తున్నట్టు పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా సిద్ధం చేసి దాచిన (90)

లీటర్ల బెల్లము ఊటను ధ్వంసం చేసి, షికారీ సుగుణపై కేసు నమోదు చేసి,అరెస్ట్ చేయడం జరిగింది. అనంతరం నందికొట్కూరు మెజిస్ట్రేట్ వారి ముందు హాజరు పరచగా ఆమెకు 14 రోజులు రిమాండ్ విధించి కర్నూలు సబ్ జైలుకు తరలించడం జరిగింది.ఈ దాడులలో నందికొట్కూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఎస్.ఐ జఫరుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు కుమారి, వెంకటేశ్వర్లు, శ్వేతా రాణి, శివన్న, మధు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

# సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం....





## తల్లికి వందనం పథకం విద్యార్థులకు వరం.

## ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు.

## ఎమ్మెల్యే గిత్త జయసూర్య.

నందికొట్కూరు : జూలై: 11 :(ఉత్తేజిత ప్రతినిధి):

తల్లికి వందనం పథకం విద్యార్థులకువరమని ప్రతి ఒక్క ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పగిడ్యాల మండలం నెహ్రూ నగర్ గ్రామంలో టిడిపి నాయకుడు లోకానంద రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం గడిచిన సంవత్సర కాలంలో ప్రజలకు ఏమేమి చేసిందో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలను వివరించారు. ప్రభుత్వ పథకాలు అందరికీ సవ్యంగా అందుతున్నాయా, లేదా? అనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ



సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని అయినా కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి ఏడాదిలోని తమ హామీలకు కట్టుబడి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని అన్నారు. తల్లికి వందనం ద్వారా ప్రతి మండలంలో రూ. 6కోట్ల నుంచి రూ. 9 కోట్ల వరకు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులుచదివించేందుకు ఈ పథకం ఎంతో దోహద పడుతుందన్నారు. ప్రతి పాఠశాలలో సీఎం, డిప్యూటీ సీఎం, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలు ఏర్పాటు చేయాలనీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు .తమ ఎలక్షన్ల హామీ అయినటువంటి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ లు ఇస్తున్నారని అన్నారు.

యువతకు 16,347 పోస్టులతో డీఎస్సీ నియామకాలు త్వరలోనే చేపట్టబోతున్నారని

ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నారని అన్నారు. రైతు సంక్షేమం కొరకు కేంద్రంతోపాటు రాష్ట్ర నిధులు జోడించి

అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే ప్రారంభం అవుతుందని అన్నారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం ఐదు రూపాయలకే న్యాయమైన భోజనం అందిస్తున్నారని అన్నారు.టిడిపి శ్రేణులు వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తీపి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ సుమిత్రమ్మ, మండల విద్యాధికారి సుభాన్, వ్యవసాయ అధికారి మురళీధర్ ,కేసీ కాలువ ఏఈ వీరమ్మ, టీడీపీ నాయకులు మండల కన్వీనర్ పలుచాని మహేష్ రెడ్డి, రామిరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, రామస్వామి, ఎంపీటీసీ మోహన్, ఏసన్న, గంగన్న, పాలమర్రి నాగరాజు, అశోక్, శివ, జల్లి శ్రీనివాసులు, ఫరూక్ భాష, బాలకృష్ణ ఫ్యాన్స్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి కృషి చేస్తా.... ఎమ్మెల్యే జయ సూర్య.

## రెండు అదనపు గోదాముల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం.

## వ్యవసాయ మార్కెట్ యార్డ్ పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే గిత్త హామీ.



నందికొట్కూర్ ,జులై :11 :( ఉత్తేజిత ప్రతినిధి):

నియోజకవర్గ కేంద్రం మైన నందికొట్కూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని నందికొట్కూర్ నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త జయసూర్య తెలిపారు. శుక్రవారం మార్కెట్ యార్డ్ పాలకవర్గ సమావేశం స్థానిక మార్కెట్ యార్డ్ సమావేశ భవనంలో చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన మొట్టమొదటి పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య మాట్లాడుతూ గతంలో నందికొట్కూరు మార్కెట్ యార్డ్ ఎంతో సుందరవనంగా ఉండేదని అయితే గత ఐదేళ్ల వైసిపి పాలనలో మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఎలాంటి కృషి జరగలేదన్నారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో గతంలో తలపెట్టిన కాంప్లెక్స్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇటీవలే ఆ కాంట్రాక్టర్ మరణించినట్లు తెలిసిందని అన్నారు. అయితే నిర్మాణంపై సమీక్షించి కాంప్లెక్స్ నిర్మాణాన్ని పూర్తిచేసి కాంప్లెక్స్ ద్వారా మార్కెట్ యార్డ్ కు ఆదాయం వచ్చే విధంగా తీర్చిదిద్దాలని ఆయన పాలకవర్గానికి పిలుపునిచ్చారు. నందికొట్కూరు వ్యవసాయం మార్కెట్ యార్డ్ నందు కోల్డ్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికలు పంపి వ్యవసాయ శాఖ మంత్రి ద్వారా మంజూరుకు కృషి చేస్తానన్నారు. వీటితో పాటుగా రైతుల పంటలను అరబోసుకునేందుకు ఫ్లాట్ ఫారం లు మైనర్ రిపేర్ చేయించి రైతులకు అందు బాటులోకి తెచ్చే విధంగా పాలకవర్గం కృషి చేయాలనిఆయన తెలిపారు. అలాగే రెండు గోదాములను అదనంగా నిర్మిం చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి వాటి మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే జయ సూర్య హామీ ఇచ్చారు. నేషనల్ హైవే రావడంతో నందికొట్కూర్ మార్కెట్ యార్డ్ కు ఆదాయము తగ్గిపోయిందని ఆయన అన్నారు. స్థానికంగా మార్కెట్ యార్డ్ ను అభివృద్ధి చేసి ఆదాయం వచ్చే విధంగా కృషి చేసే ప్రయత్నం చేయాలని పాలకవర్గాన్ని కోరారు. వ్యవసాయ మార్కెట్

యార్డ్ సమస్యలన్నింటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించి మార్కెట్

యార్డ్ ను రైతులకు అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సుధాకర్ యాదవ్ ,డైరెక్టర్ మాంద్ర సురేంద్రనాథ్ రెడ్డి, పగిడాముల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, మిడుతూర్ మండల నాయకులు సింగిల్విండో చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు,మార్కెట్ కార్యదర్శి రామ చంద్రయ్య తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# చర్చిల పవిత్రతను కాపాడుతాం





## కర్నూలు సి.యస్.ఐ క్రైస్ట్ చర్చి పాస్టేట్ ॥ లో ఎన్నికల హడావుడి ముందంజ లో "గాడ్స్ ప్యానెల్ "

ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు 11:




2025 2028 ట్రయోనియం కు సంబంధించి కర్నూలు సి.యస్.ఐ క్రైస్ట్ చర్చి పాస్టేట్ -II లో "పాస్టేట్ కమిటీ" ఎన్నికలు ఈ నెల 13 వ తేదీ ఆదివారం జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 732 కు పైగా ఓటర్లు ఓటింగ్ లో పాల్గొని జనరల్ విభాగంలో 10 మంది అభ్యర్థులకు, స్త్రీల రిజర్వుడు విభాగంలో 04 నలుగురు అభ్యర్థులకు, యవ్వనస్తుల రిజర్వుడు విభాగంలో 04 నలుగురు అభ్యర్థులకు ఓటు వేయాల్సి ఉంటుంది. మొత్తం మూడు ప్యానెల్ లు ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో నూతనంగా ప్యానెల్ గా ఏర్పడి పోటీ చేస్తున్న "గాడ్స్ ప్యానెల్ " తమకు అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తామని, నీతి నిజాయితీగా పని చేస్తామని,చర్చి పవిత్రతను కాపాడతామని చెబుతూ ఓటర్లను ఆకట్టుకుంటూ వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తూ ముందుకు దూసుకుని పోతుంది. యవ్వనస్థుల, ఉన్నత విద్యా వంతులు, రిటైర్డ్ గెజిటెడ్ అధికారులు,అనుభవజ్ఞులు,మేధావుల కలయికతో ఈ గాడ్స్ ప్యానెల్ ఏర్పడింది. గత రెండు దశాబ్దాలుగా ఉన్న కమిటీ వారు కొందరు అనుకున్నంత స్థాయిలో చర్చి ని అభివృద్ధి చేయకపోవడం,వారిపై సంఘానికి మంచి అభిప్రాయం లేకపోవడం ,పాత వారే మళ్ళీ మళ్ళీ పోటీలో ఉండడం "గాడ్స్ ప్యానెల్ " కు కలిసొచ్చే అంశంగా ఉంది. పై అంశాలు ఆధారంగా ఓటర్లు కూడా మార్పు కోరుతూ "గాడ్స్ ప్యానెల్ " కు విజయావకాశాలు ఉన్నట్లు భావిస్తూ వారి వైపే మొగ్గు చూపుతున్నారు . ఈ నేపథ్యంలో ఓటర్లు,సంఘసభ్యులు కొత్త ప్యానెల్ ద్వారానే అభివృద్ధి సాధ్యం అవుతుందని చర్చించుకోవడం విశేషం.ఈ సందర్భంగా గాడ్స్ ప్యానెల్ అభ్యర్థులు మాట్లాడుతూ 13 వ తేదీ జరగబోయే ఎన్నికల్లో భారీ ఎత్తున ఓటర్లు పాల్గొని మీ ఓటును గాడ్ ప్యానల్ కు వేసి ఆశీర్వదించాలని కోరుతున్నారు.

# బుద్ధునితో నా ప్రయాణం కరపత్ర ఆవిష్కరణ

### బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జూలై 16వ తేదీ సాయంత్రం 6:00 గంటలకు

**కర్నూలు జిల్లా లోని జులై 11**



శుక్రవారం సి క్యాంపు లోని టీ. జి. వి. కళాక్షేత్రం ( లలిత కళా సమితి),లో జరగబోవు లిబుద్ధునితో నా ప్రయాణం అనే బుద్ధ అంబేడ్కర్ తెలుగు నాటకం ప్రదర్శన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఉదయం ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కర్నూలు జిల్లా గౌరవ అధ్యక్షురాలు నాగమ్మ పూలే జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, సామాజిక ఉద్యమ నాయకులు కొమ్ముపాలెం శ్రీనివాసులు ఆవిష్కరించారు. బిర్లా కాంపౌండ్ లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు లినక్కలమిట్ట శ్రీనివాసులు గారి కార్యాలయం లో జరిగినా కార్యరమానికి బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కర్నూలు జిల్లా అధ్యక్షులు పుసులూరి చిరంజీవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కెవిపియస్ నాయకులు ఆనంద్ బాబు బహుజన విద్యావంతుల వేదిక జె.వి.కృష్ణయ్య బహుజన టీచర్స్ అసోసియేషన్ డి.రామశేషయ్య ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నాయకురాలు నంది విజయలక్ష్మి అడ్వకేట్ కరుణాకర్ రిపోర్టర్ కరణ్ తదితరులు పాల్గొన్నారు.ఈ నాటక ప్రదర్శన వల్ల బుద్ధుడు, అంబేడ్కర్ గారి గురించి తెలియని ఎన్నో విషయాలు తెలుస్తాయని వక్తలు పేర్కొన్నారు. ఈ నాటకానికి రావాలని ప్రజలందరికీ ఆహ్వానం పలికారు.

# నేడు మండలంలో విద్యుత్ కోతలు

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ జూలై 11**

సి.బెళగల్ మండల పరిధిలోని అన్ని 33/11 కె.వి సబ్ స్టేషన్లలో సాధారణ మరమ్మత్తుల నిర్వహణలో భాగంగా ప్రతినెల రెండో శనివారం సి.బెళగల్ మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏ.ఈ సుకుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, కావున రైతులు, వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు సహకరించవలసిందిగా కోరుచున్నామని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన P-4 కార్యక్రమం ద్వారా సామాజిక అభివృద్ధికి ముందడుగు

### 5 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,జూలై 11**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన P-4 (Peopleμs Participation for Progress & Prosperity) కార్యక్రమం కింద, తిరుపతి జిల్లాలో సామాజిక అభివృద్ధికి దోహదపడే విధంగా జిల్లాలో అందరికీ ఆదర్శప్రాయంగా మొదటగా 5 బంగారు కుటుంబాలను దత్తతగా తీసుకొని తన బాధ్యతను చాటి చెప్పిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ తిరుపతి తిరుచానూరు సమీపంలో గల నక్కల కాలనీకి చెందిన నాలుగు కుటుంబాలను, దామినేడుకు చెందిన 1 కుటుంబాన్ని మొత్తం 5 కుటుంబాలను దత్తత తీసుకొని క్రమంలో ఆ కుటుంబ సభ్యులు అందరూ కలిసి కలెక్టర్ గారికి కృతజ్ఞత భావంతో ధన్యవాదాలు తెలిపారు.బంగారు కుటుంబాల వివరాలు 1. ఎస్. సావిత్రమ్మ, ఏలుమలై కుటుంబం2. వేదవల్లి, విజయశాంతి, విష్ణు అనిత, గంగోత్రి, బాబు కుటుంబం3. అంబికా, నందు, వీరభద్ర, చిన్నతంబి కుటుంబం4. బలరాం, అనిత, కర్ప స్వామి, గాంధీ, శాంతి కుటుంబం5.దామినేడుకు చెందిన విజయశాంతి, బాబు, ధనుష్, యోగి కుటుంబంకలెక్టర్ గారు ఈ కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలలో పునాదులు ఏర్పడేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కుటుంబాల సంక్షేమం కోసం వ్యక్తిగతంగానే కాకుండా, జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల సహకారంతో కూడిన సమన్వయంతో సహాయాన్ని అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం జిల్లాలోని అధికారులకు ప్రజా ప్రతినిధులకు , సమాజసేవకులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుంటే గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని కలెక్టర్ గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా జిల్లా యంత్రాంగం ప్రజలతో నేరుగా అనుసంధానం సాధించి, అభివృద్ధిని క్రియాశీలంగా అమలు చేయడమే లక్ష్యమని అన్నారు.

# గాజులదిన్నె ప్రాజెక్టు క్రింద ముంపు గ్రామంలో ఉన్న పిల్లిగుండ్ల గ్రామ మాదిగ కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇవ్వండి మహా ప్రభో

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



గోనెగండ్ల జులై 11 శుక్రవారం ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామంలో ఎస్సీ కాలనీ దగ్గర సమావేశం నిర్వహించడం జరిగింది సమావేశంలో ప్రజలతో మాట్లాడుతూ కొన్ని విషయాలపై చర్చించడం జరిగింది ప్రజలు మాట్లాడుతూ మాకు గ్రామంలో నీటి సమస్య ఉంది మరియు గాజులదిన్నె ప్రాజెక్టు ముంపు గ్రామల పరిధిలో మా పిల్లిగుండ్ల గ్రామం కూడా ఉంది గతంలో సదన్గా కట్ట తెగిపోయేసరికి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పిల్లలను తీసుకొని సదన్గా వేరే గ్రామానికి ప్రాణభయంతో పోవడం జరిగింది అప్పటినుంచి ఇప్పటివరకు మా గ్రామం ముంపు గ్రామంగా ఉంది మాకు ప్రభుత్వం సురక్షితమైన ప్రదేశంలో ఇంటి స్థలాలు ఇచ్చి పట్టాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని గత కొన్ని సంవత్సరాల నుండి అర్జీలు ఇచ్చాము ఎవరు కూడా పట్టించుకోలేదు అంటూ చెప్పారు ఈ కార్యక్రమంలో ప్రజలు చెప్పినవన్నీ దృష్టిలో పెట్టుకొని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి హరిజన జయన్న మాదిగ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులు ముంపు గ్రామంలో ఉన్న పిల్లిగుండ్ల గ్రామం మాదిగ కుటుంబాలకు ఎవరికైతే రేషన్ కార్డు ఉందో ప్రతి ఒక్కరికి 2 సెంట్లు చొప్పున స్థలం ఇచ్చి పట్టా ఇవ్వాలి అంటూ మాట్లాడారు తక్షణమే అధికారులు ఎంక్వయిరీ చేసి గోనెగండ్ల గ్రామం పరిధిలో ఎక్కడైతే ప్రభుత్వం భూమి ఉంటుందో అక్కడ ప్రజలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని లేనియెడల కొనుగోలు పథకం కింద కొని ప్రజలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని మాట్లాడారు అనంతరం ప్రజలతో గోనెగండ్ల మండలం ఎమ్మార్వో ఆఫీస్ కు పోయి ఎమ్మార్వో గారికి ఇంటి స్థలాలు ఇవ్వాలంటూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారుహరిజన జయన్న మాదిగ ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిపరిగల ప్రకాష్ రాజ్ మాదిగఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కర్నూల్ఎమ్మిగనూరు మండల నాయకులు ఆరెకంటి రాజు మాదిగగోనెగండ్ల మండల అధ్యక్షులు మునెప్ప మాదిగపిల్లిగుండ్ల గ్రామ కమిటీ అధ్యక్షులు 2 ఖాసం ఉపాధ్యాయులు 3 ఆదమ్ ప్రధాన ఆర్య దర్శి 4 ప్రవీణ్ కుమార్ . 5 కార్యదర్శి బోజప్ప మరయు గ్రామ కమిటీ సభ్యులు పల్గొనడం జరిగింది.

# డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు యూసుఫ్ గారికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియామకం

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు జులై 11 శుక్రవారం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా చేర్చే నిబద్ధత గల నాయకుడికి కీలక బాధ్యతజూలై 11: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు యూసుఫ్ గారికి నియామకాన్ని పార్టీ కేంద్ర కార్యాలయం అధికారికంగా ప్రకటించింది.ఈ బాధ్యత ఆయనకు ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక గారి నాయకత్వంలో, పార్టీ సీనియర్ నాయకులు శ్రీ బుట్టా శివ నీలకంఠ , రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు శ్రీ బుట్టా ప్రతుల్ గారి సహకారంతో అప్పగించబడింది.

# రసవత్తరంగా సాగిన సర్వసభ్య సమావేశం

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ జూలై 11**



అధికారులందరూ ప్రజా సమస్యలు పరిష్కరించి మండల అభివృద్ధికి తోడ్పడాలని సి.బెళగల్ ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. శుక్రవారం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాణెమ్మ గత మూడు నెలల కాలంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి మండలం సబ్సిడీ ద్వారా 80 వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశామని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం సంబంధించి 16,654 రైతులు ఈకేవైసీ చేసుకున్నారని తెలిపారు. అనంతరం మండలంలో యూరియా కొరత లేదని తెలిపారు. అనంతరం ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని జలజీవన్ మిషన్ కింద చింతమాను పల్లెల్లో 42 లక్షలతో మంచి నీటి ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామని, సి.బెళగల్ గ్రామపంచాయతీలో 80 లక్షలతో, తిమ్మందొడ్డి గ్రామంలో 27 లక్షలతో మంచినీటి ట్యాంక్ తో పాటు ప్రతి ఇంటికి కొళాయిలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం పంచాయతీరాజ్ అధికారి వెంకట ప్రకాష్ మాట్లాడుతూ గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం కొరకు ఫేస్ 1 కింద కోటి రూపాయలు , ఫేస్ 2 కింద ఉపాధి హామీ నిధుల ద్వారా 90 లక్షలకు రూపాయలతో సీసీ రోడ్ల నిర్మించామని, అలాగే కస్తూర్బా పాఠశాల నుండి బీటు రోడ్డు వరకు 16 లక్షల తో సిసి రోడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అనంతరం ఎంఈఓ జ్యోతి మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణశాతం పెరిగిందని తెలిపారు. అనంతరం సభ్యులు కలగజేసుకుని కస్తూర్బా పాఠశాలలో సీట్ల విషయాల్లో అవకతవకలు జరుగుతున్నాయని విద్యాశాఖ అధికారులను నిలదీశారు. ఇరిగేషన్ అధికారి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ సి.బెళగల్ చెరువు పునర్నిర్మాణం కొరకు 2 రెండు కోట్ల 25 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో చెరువు పునర్ నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. అలాగే ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ లో మాత్రమే రైతులకు నీరందిస్తామని తెలిపారు.అనంతరం డిప్యూటీ తహసిల్దార్ పురుషోత్తముడు మాట్లాడుతూ 65 సంవత్సరాలు దాటిన వృద్ధులందరికీ, ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తెలిపారు. అనంతరం గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ చింతలయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం గురుకుల పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు అనంతపురం ఐఐటీలో నీట్ ప్రవేశ పరీక్ష కొరకు ఎంపికయ్యారని తెలిపారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల భోజనాలకు సంబంధించిన వంట గ్యాస్ గ్యాస్ కొరత ఉందని తెలిపారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు ఈరన్న గౌడ్ మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులకు 18 నెలల నుండి జీతాలు లేవని, మాకు వెంటనే జీతాలు విడుదల చేయాలని ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. అలాగే పోలకల్ నుండి సి.బెళగల్ ప్రధాన రహదారి గుంతల మయంగా మారిందని, రహదారి నిర్మాణాన్ని చేపట్టి ప్రజల కష్టాలు తీర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి, ఆర్టీసీ, ఐడిఎస్, మత్స్యశాఖ, వెల్ఫేర్ అధికారులు గై హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, శ్రీనివాసులు, డిప్యూటీ తహసిల్దార్ పురుషోత్తముడు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు,సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి కృషి చేస్తా.... ఎమ్మెల్యే జయ సూర్య.

రెండు అదనపు గోదాముల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం.
వ్యవసాయ మార్కెట్ యార్డ్ పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే గిత్త హామీ.



**నందికొట్కూర్ ,జులై :11 :( ఉత్తేజిత ప్రతినిధి):**

నియోజకవర్గ కేంద్రం మైన నందికొట్కూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని నందికొట్కూర్ నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త జయసూర్య తెలిపారు. శుక్రవారం మార్కెట్ యార్డ్ పాలకవర్గ సమావేశం స్థానిక మార్కెట్ యార్డ్ సమావేశ భవనంలో చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన మొట్టమొదటి పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య మాట్లాడుతూ గతంలో నందికొట్కూరు మార్కెట్ యార్డ్ ఎంతో సుందరవనంగా ఉండేదని అయితే గత ఐదేళ్ల వైసిపి పాలనలో మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఎలాంటి కృషి జరగలేదన్నారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో గతంలో తలపెట్టిన కాంప్లెక్స్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇటీవలే ఆ కాంట్రాక్టర్ మరణించినట్లు తెలిసిందని అన్నారు. అయితే నిర్మాణంపై సమీక్షించి కాంప్లెక్స్ నిర్మాణాన్ని పూర్తిచేసి కాంప్లెక్స్ ద్వారా మార్కెట్ యార్డ్ కు ఆదాయం వచ్చే విధంగా తీర్చిదిద్దాలని ఆయన పాలకవర్గానికి పిలుపునిచ్చారు. నందికొట్కూరు వ్యవసాయం మార్కెట్ యార్డ్ నందు కోల్డ్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికలు పంపి వ్యవసాయ శాఖ మంత్రి ద్వారా మంజూరుకు కృషి చేస్తానన్నారు. వీటితో పాటుగా రైతుల పంటలను అరబోసుకునేందుకు ఫ్లాట్ ఫారం లు మైనర్ రిపేర్ చేయించి రైతులకు అందుబాటులోకి తెచ్చే విధంగా పాలకవర్గం కృషి చేయాలనిఆయన తెలిపారు. అలాగే రెండు గోదాములను అదనంగా నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి వాటి మంజూరుకు కృషి చేస్తానని

ఎమ్మెల్యే జయ సూర్య హామీ ఇచ్చారు. నేషనల్ హైవే రావడంతో నందికొట్కూర్ మార్కెట్ యార్డ్ కు ఆదాయము తగ్గిపోయిందని ఆయన అన్నారు. స్థానికంగా మార్కెట్ యార్డ్ ను అభివృద్ధి చేసి ఆదాయం వచ్చే విధంగా కృషి చేసే ప్రయత్నం చేయాలని పాలకవర్గాన్ని కోరారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమస్యలన్నింటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించి మార్కెట్ యార్డ్ ను రైతులకు అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సుధాకర్ యాదవ్ ,డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, పగిడాముల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, మిడుతూర్ మండల నాయకులు సింగిల్విండో చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు,మార్కెట్ కార్యదర్శి రామచంద్రయ్య తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# మఠం భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు అని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, జూలై 11**



. శుక్రవారం వివాదంలో ఉన్న తిరుపతి డివిజన్ లోని తిరుపతి రూరల్ మండలం అర్బన్ మండలాలలో విస్తరించి ఉన్న సర్వే నంబర్145, 147 లు హంథిరాంజి మఠం , పరకాల మఠం భూములను తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత తహసిల్దార్ తో కలిసి పరిశీలించారు.

తిరుపతి డివిజన్ లోని తిరుపతి రూరల్ మండలం అర్బన్ మండలాలలో విస్తరించి ఉన్న సర్వే నంబర్145, 147 లు హంథిరాంజి మఠం, పరకాల మఠానికి సంబంధించి వివాదం నడుస్తుంది. ఈ వివాదానికి సంబంధించి హైకోర్టు స్టేటస్ కో విధించడం జరిగింది. ఈ స్టేటస్ కో ను ఉల్లంఘించి పరకాల మఠం ద్వారా పొందిన నరసింహారెడ్డి అతని తరపు మనుషులు కోర్టు ధిక్కారానికి పాల్పడి కోర్టు ఉత్తర్వులు పరిగణలోకి తీసుకోకుండా సదరు స్థలంలో నిర్మాణాలు చేస్తున్నారని సమాచారం అందుకున్న ఎండోమెంట్ ఈవో బాపిరెడ్డి గారు అలాగే రెవిన్యూ డివిజన్ ఆఫీసర్, తిరుపతి, తహసిల్దార్ రామాంజనేయులు నాయక్ అలాగే చంద్రగిరి డిఎస్పి ప్రసాద్, సిఐ ఎంఆర్ పల్లి సదరు స్థలాన్ని పరిశీలించి కోర్టు స్టేటస్ కో వచ్చినప్పటికీ అందులో నిర్మాణాలు చేస్తున్నటువంటి నరసింహారెడ్డి తరపు మనుషులను పిలిపించి వారికి ఎటువంటి నిర్మాణాలు చేయవద్దని సూచన ఇవ్వడం జరిగింది. ఎవరైనా కూడా కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి నిర్మాణాలు చేపడితే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలిపారు. అదేవిధంగా అవిలాల గ్రామంలోని సర్వే నంబర్ 146 లో వాగు పోరంబోకు ఇదే హతీరాంజీ మఠం ను అనుకొని ఉంది. ఈ కాలవపారంబోకు భూమిని కూడా సదరు వ్యక్తులు ఆక్రమించినట్లు తెలియడంతో వాళ్లకు నోటీసులు ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో వాటిని తొలగించడానికి ఈరోజు తాసిల్దారు తన సిబ్బందితో ఆక్రమణకు గురైన కాలవపారంబోకు ను తొలగించడం కోసం వెళ్లినప్పుడు సేతు మాధవ్ అనే వ్యక్తి ఇతరులు కలిసి తాసిల్దార్ ను అడ్డుకోవడం జరిగిందని అన్నారు. 147 సర్వే నంబర్స్ సంబంధించిన భూమి ఇది అని, 146 కాదని వాదించడం జరిగింది ఈ సందర్భంగా ఇది ప్రభుత్వ భూమి సుప్రీంకోర్టు సూచన మేరకు వాటర్ బాడీ కాబట్టి ఇందులో ఆక్రమణలు సహించమని చెప్పడం జరిగింది. దీనికి సంబంధించి నోటీసులు ఇచ్చిన ఎటువంటి స్పందన లేదు కాబట్టి ఈరోజు తొలగించడానికి రావడం జరిగింది అని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి ఈ ఆక్రమణను తొలగిస్తుండగానే సేతు మాధవ్ మరి కొందరు వ్యక్తులతో వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ డిపార్ట్మెంట్ వారు ఎండోమెంట్ భూముల సంబంధించి రెవెన్యూ కాలువ పారంబోకు ఆక్రమణకు సంబంధించిన రెవెన్యూ వారు సదరూ సేతుమాధవ్, ఇతరులను హెచ్చరించడం జరిగింది, ఈ సందర్భంగా కోర్టు దిక్కారానికి ఎవరైనా పాల్పడితే వారిని ఉపేక్షించేది లేదు వారి పైన కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించడం జరిగింది. గౌరవ హైకోర్టు వారు స్టేటస్ కో విధించినప్పటికీ మఠం భూములను ఆక్రమించడం, నిర్మాణాలు చేయడం వల్ల వారిని హెచ్చరించి ఆక్రమణకు పాల్పడద్దని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.

# రేవంత్‌రెడ్డి విజ్ఞప్తిపై స్పందించిన కేంద్రమంత్రి



తెలంగాణ: యూరియా కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసి యూరియా సరఫరా చేయాలని కోరగా, ఆయన వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచిస్తూ, ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని రేవంత్ రెడ్డికి నడ్డా సూచించారు. రైతులందరికీ ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

తెలంగాణ రైతాంగానికి సంబంధించిన విషయంలో ముఖ్యమంత్రి రేవంతరెడ్డి విజ్ఞప్తిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. రెండు రోజుల కిందట ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర మంత్రి జేపీ నడ్డా ను కలిసి ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు. తెలంగాణకు సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం సరఫరా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన జేపీ నడ్డా, తెలంగాణ రైతులకు అవసరమైన యూరియాను అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. తెలంగాణలో యూరియా ఎరువులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగినంత యూరియా సరఫరా చేయాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా చెప్పారు. తెలంగాణ రైతుల డిమాండ్‌ను నెరవేర్చేందుకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఢిల్లీలో మీడియాతో జేపీ నడ్డా మాట్లాడుతూ... రసాయన ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల భూ సారం తగ్గిపోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీని గురించి తెలంగాణ ముఖ్యమంత్రికి సూచించినట్లు తెలిపారు. 2023-24 రబీ సీజన్‌తో పోలిస్తే 2024-25లో 21 శాతం యూరియా అమ్మకాలు పెరిగాయని ఆయన వెల్లడించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 12.4 శాతం వినియోగం పెరిగిందని చెప్పారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు వాడకుండా చూడాలని నడ్డా సూచించారు.

ప్రత్యామ్నాయ ఎరువులు వినియోగం, సేంద్రీయ వ్యవసాయం ద్వారా రసాయన ఎరువుల వాడకం బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తగ్గించవచ్చని అన్నారు. దీనికోసం పథకం గురించి తెలంగాణ అధికారులకు వివరించారు. ఈ విషయాన్ని కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రంజిత్ కుమార్ మిశ్రా తెలియజేశారు. రాష్ట్రంలోని జిల్లాల మధ్య ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను జేపీ నడ్డా ఆదేశించారు. రైతులందరికీ ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# డైవర్షన్ పాలిటిక్స్ వద్దంటూ సెటైర్లు!

తెలంగాణ: జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం కాదు, తామే పోలీస్ కంట్రోల్ సెంటర్‌కు వస్తామని అన్నారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని, మహిళలకు నెలకు రూ. 2,500 ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డికి అవినీతి చక్రవర్తి, అసమర్థ ముఖ్యమంత్రి అనే బిరుదు ఇచ్చామని కవిత విమర్శించారు.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పదే పదే అసెంబ్లీకి రావాలంటూ సీఎం రంకెలు వేస్తున్నారని, ముందు మహిళలకు ఇస్తానన్న హామీల గురించి మాట్లాడాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం కాదు.. తామే మీ పోలీస్ కంట్రోల్ సెంటర్‌కు వస్తామంటూ సెటైరికల్‌గా మాట్లాడారు. డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడటం మానుకొని మహిళలకు ఎందుకు తులం బంగారం ఇస్తలేరో చెప్పాలంటూ ప్రశ్నించారు.

తెలంగాణ జాగృతిలో కొత్తగూడెం సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీరన్న చేరిక సందర్భంగా కవిత మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని మహిళలకు ఇస్తానన్న నెలకు రూ. 2,500ను ఎందుకు ఇవ్వడం లేదో చర్చ చేద్దామన్నారు. తులం బంగారం ఎందుకు ఇస్తలేరో.. పింఛన్లు ఎందుకు పెంచడం లేదో చర్చిద్దామన్నారు. మీ మోసాలను ప్రజలు గమనిస్తూనే ఉంటారని గుర్తుంచుకోవాలని ఆమె చెప్పారు.

తెలంగాణ జాగృతిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతపరుస్తామని, సీఐటీయూ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వీరన్న, ఆయన అనుచరుల చేరికపై కవిత హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం జై తెలంగాణ అనడం లేదని, రాష్ట్రంలో పరిపాలన ఎలా ఉందో అందరం చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ రైతు రుణమాఫీ కాలేదని.. చర్చకు రమ్మంటే సీఎం పారిపోయాడంటూ ఎద్దేవా చేశారు.

సింగరేణిని రేవంత్ రెడ్డి అస్సలు పట్టించుకోవడం లేదని, కనీసం ఉద్యోగాలు కూడా రావడం లేదంటూ కవిత విమర్శించారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రేవంత్ రెడ్డికి అవినీతి చక్రవర్తి, అసమర్థ ముఖ్యమంత్రి అనే బిరుదు ఇచ్చామన్నారు. కొత్తగూడెం అంటేనే పరిశ్రమల జిల్లా అని.. స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని పునరుద్ధరణ చేయాలని ఆమె కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ.. భద్రాచలం చుట్టుపక్కలున్న ఐదు గ్రామ పంచాయతీలు ఆందోళనలో ఉన్నాయన్నారు. భద్రాచలం రాముడి భూములు పురుషోత్తపట్నంలో ఉన్నాయని, ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు తుమ్మల చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసు..

హైదరాబాద్: మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసు ప్రకంపనలు రేపుతోంది. ఈగల్ టీమ్ దర్యాప్తులో సూర్య అనే వ్యక్తి గోవా నుండి డ్రగ్స్ తెప్పించి, కొరియర్ ద్వారా పబ్‌లు, డాక్టర్లకు సరఫరా చేస్తున్నాడని తేలింది. ఆడవాళ్ల చెప్పుల్లో డ్రగ్స్ దాచి రవాణా చేసేవాడని తెలిసింది. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు ఉన్నారో తెలుసుకోవడానికి ఈగల్ టీమ్ లోతుగా దర్యాప్తు చేస్తోంది. త్వరలోనే మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

హైదరాబాద్‌లో సంచలనంగా మారిన మల్నాడు కిచెన్ డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ దర్యాప్తు ముమ్మరం చేసింది. అసలు ఈ మల్నాడు కిచెన్‌కు డ్రగ్స్ ఎలా చేరాయి? అక్కడ నుంచి ఎక్కడెక్కడికి డెలివరీ అయ్యాయి? ఇందులో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. పలువురి డాక్టర్లకు కూడా మల్నాడు కిచెన్ నుంచి డ్రగ్స్ వెళ్లినట్లు ఈగల్ బృందం గుర్తించింది.

గోవాలో నైజీరియా దేశస్థుడు నిక్ నుంచి కొకైన్, ఎండీఎంఏను మల్నాడు కిచెన్ యజమాని సూర్య డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు ఈగల్ టీమ్ విచరణలో బయటపడింది. గోవా నుంచి కొరియర్ల ద్వారా డ్రగ్స్ మల్నాడు కిచెన్‌ను వచ్చేవని.. అక్కడ నుంచి పబ్‌లు, ప్రముఖులకు అవి సప్లయ్ అయినట్లు ప్రత్యేక బృందం గుర్తించింది. మల్నాడు కిచెన్ యజమాని సూర్య అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్ నడుపుతున్నట్లు ఈ విచారణలో వెల్లడయింది. మల్నాడు కిచెన్ నుంచి ఆర్డర్ల వారీగా డ్రగ్స్‌ను సప్లయ్ చేసినట్లు ఈగల్ టీమ్ ఆధారాలు కూడా సేకరించింది. రెస్టారెంట్లతో పాటు హైదరాబాద్‌లో ఉన్న 20 పబ్బులకు ఇప్పటి వరకు డ్రగ్స్ సప్లయ్ అయ్యాయని, అలాగే పలువురు ప్రముఖులకు డోర్ డెలివరీ చేసినట్లుగా కూడా గుర్తించారు. ఈ ప్రముఖుల్లో హైదరాబాద్‌లోని కొందరు డాక్టర్లు కూడా ఉన్నట్లు ఈగల్ గుర్తించింది.

డ్రగ్స్ కోసం హాస్పిటల్ ట్రీట్మెంట్ పేరుతో రూ. 1.8 లక్షల నగదు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. శ్రీ మారుతి కొరియర్ పేరుతో డ్రగ్స్ ప్యాకెట్లు సరఫరా అయ్యాయని.. ఆడవాళ్ల చెప్పుల హీల్స్ నుంచి కొకైన్, ఎక్స్‌టసీ పిల్స్, ఓజీ కుష్ ఆయిల్‌ను ఈగల్ టీమ్ స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్‌లోని 15 మంది డాక్టర్లకూ కొరియర్ల ద్వారా సూర్య ఈ డ్రగ్స్ అందజేశాడు. మూడు పబ్‌ల యజమానులతో కలిసి అప్పుడప్పుడు డ్రగ్ పార్టీలు కూడా నిర్వహించినట్లు విచారణలో తేలింది. వచ్చే వారం ముగ్గురు పబ్ యజమానులు తమ ఎదుట హాజరుకావాలంటూ నోటీసులు అందించాలనే ఆలోచనలో ఈగల్ టీమ్ ఉంది.

# ఇన్వెస్టిగేషన్ చేయాలి..



తెలంగాణ: బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ వ్యవహారం టాలీవుడ్ లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో 29 మంది సినీ సెలబ్రిటీలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. అయితే ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ బీజేపీ తీరును తప్పుబడుతూ బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ లను కూడా విచారించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్, ఆయన సోదరులు ఎప్పుడూ బెట్టింగ్ యాప్‌లు ప్రమోషన్ చేయలేదా? అంటూ కేఏ పాల్ ఈడీని ప్రశ్నించారు.

టాలీవుడ్‌ని బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ ఇప్పుడు కుదిపేస్తోంది. బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్స్ చేశారంటూ 29 మంది సినీ సెలబ్రిటీలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులు నమోదు చేసింది. సైబరాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారణ చేపట్టిన ఈడీ సినీ సెలబ్రిటీలు, యూట్యూబర్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లను విచారించేందుకు సిద్ధమైంది. అయితే, బీజేపీ తీరును తప్పుబట్టిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ బాలకృష్ణ, పవన్ కళ్యాణ్‌ను కూడా విచారించాలంటూ డిమాండ్ చేశారు.

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో బీజేపీతో సంబంధాలు ఉన్నవారిని విడిచిపెడుతున్నారని కేఏ పాల్ ఆరోపించారు. టీడీపీ, జనసేన నాయకులు బీజేపీ నాయకులు కలిస్తే వారిని వదిలేస్తారా? అంటూ ప్రశ్నించారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, ఏపీ ఉప ముఖ్యమంత్రి కానీ ఆయన సోదరులు కానీ బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేయలేదా? అంటూ ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కేఏ పాల్ డిమాండ్ చేశారు. "బాలకృష్ణ అనే ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ, పవన్ కళ్యాణ్ అనే ఉప ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో వాళ్ల బ్రదర్స్ ఎప్పుడూ బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేయలేదా? ఇన్వెస్టిగేషన్ చేయండి! ఎవరైనా బీజేపీతో ఉంటే సెలెక్టివ్‌గా వారిని వదిలేస్తారా? బీజేపీతో కలిస్తే ఈడీ రైడ్లు ఉండవు, సీబీఐ రైడ్లు ఉండవు. మీకు పద్మభూషణ్‌లు ఇస్తారు, భారతరత్నలు ఇస్తారు. మిమ్మల్ని చాలా క్లీన్‌గా కాపాడుతారు" అని కేఏ పాల్ అన్నారు.

నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల ఉన్నారు. వారితో పాటు బుల్లితెర నటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు శ్రీముఖి, నయని పావని, వర్షిణి సౌందరరాజన్, సిరి హన్మంత్, వసంతి కృష్ణన్, శ్యామల, శోభా శెట్టి, అమృతా చౌదరి, నేహా పఠాని, పండు, పద్మావతి, ఇమ్రాన్ ఖాన్, విష్ణు ప్రియా, హర్షసాయి, భయ్యా సన్నీయాదవ్, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు సుప్రీత పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

హైదరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ కేసులో ఈడీ దర్యాప్తు చేస్తోంది. యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ వీళ్లందరూ ప్రమోషన్స్ చేశారని.. అందుకోసం భారీగా కమీషన్స్ తీసుకున్నారంటూ కొందరు ఫిర్యాదు చేశారు.

# మందుబాబులకు బ్యాడ్ న్యూస్..

తెలంగాణ: బోనాల సందడి మొదలైన వేళ మందుబాబులకు షాక్ తగిలింది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా హైదరాబాద్ నగరంలో రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. జూలై 13 ఉదయం 6 గంటల నుంచి 15 ఉదయం 6 గంటల వరకు మద్యం అమ్మకాలు నిలిపివేయాలని సీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. భక్తుల భవిష్యవాణి, లక్షలాదిగా తరలివచ్చే ప్రజల దృష్ట్యా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలంగాణలో ఒకపక్క బోనాల సందడి మొదలవ్వగా. . మరోవైపు మందుబాబులకు బిగ్ షాక్ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండగను అట్టహాసంగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. రాజధాని హైదరాబాద్‌లో బోనాల మోత మోగిపోవాల్సిందే. ఇంతటి వేడుకల్లో పాపం మందుబాబులకు చుక్క లేని పరిస్థితి వచ్చింది. రెండు రోజుల పాటు హైదరాబాద్ నగరంలో మద్యం షాపులు బంద్ చేస్తూ పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుంది.

సికింద్రబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల పండగ సందర్భంగా రెండ్రోజుల పాటు మద్యం షాపులు మూసేయ్యాలంటూ హైదరాబాద్ సీపీ ఆదేశాలు జారీ చేశారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి 15వ తేదీ ఉదయం 6 గంటల వరకు మద్యం షాపులు మూసేయ్యాలని సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ సెంట్రల్, ఈస్ట్, నార్త్ జోన్ల పరిధిలోని గాంధీనగర్, చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ, బేగంపేట, గోపాలపురం, తుకారంగేట్, మారేడ్ పల్లి, మహంకాళి, రామ్‌గోపాల్ పేట, మార్కెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని మద్యం షాపులు రెండు రోజుల పాటు మూతపడనున్నాయి.

బోనాల సందర్భంగా ఈ ఆదివారం రోజున సికింద్రాబాద్‌లో పోలీసులు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు రోజుల ముందు నుంచే గస్తీ పెంచిన పోలీసులు.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పహారా కాస్తున్నారు. ఉజ్జయిన మహంకాళి బోనాల్లో కీలక ఘట్టం అయిన భవిష్య వాణి రోజు మాతంగి స్వర్ణలత పచ్చికుండపై నిల్చొని చెప్పే భవిష్య వాణి నిజమవుతుందని భక్తుల నమ్మకం. ఈ బోనాల వేడుక చూసేందుకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హైదరాబాద్‌లో బోనాల పండగను తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా చేసుకుంటారు. హైదరాబాద్ నగరంలో నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. గోల్కొండ, లాల్ దర్వాజ, ఉజ్జయిని అమ్మవారి బోనాలు చాలా ప్రత్యేకం. అందుకోసమే ఈ రెండు రోజులు బోనాలు జరిగే సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తుగా జూలై 13 నుంచి 15 వరకు మద్యం షాపులను బంద్ చేశారు.

# కల్తీ కల్లు మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలివ్వాలి..



హైదరాబాద్: కల్తీ కల్లు తాగి ఆరుగురు మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ ఘటనపై బీజేపీ కూడా స్పందించి, మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. ఎక్సైజ్ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు, ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో కల్తీ కల్లు బారిన పడి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను వెంటనే ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. మృతిచెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ. 20 లక్షల నష్ట పరిహారం అందించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి మెరుగైన చికిత్స అందాలని కోరారు.

కల్తీ కల్లు తాగి ఇంత మంది చనిపోతే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం అంటూ కేటీఆర్ మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ప్రజలకు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కాయకష్టం చేసే కష్ట జీవులు కల్తీ కల్లు బారిన పడకుండా జాగ్రత్త పడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు.

మరోవైపు కూకట్‌పల్లి కల్తీ కల్లు కేసులో ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పలు కల్లు దుకాణాల నుంచి శాంపిల్స్ సేకరించిన అధికారులు వాటిని ల్యాబ్‌కి పంపారు. ల్యాబ్‌లో పరీక్షించగా.. కాంపౌండ్‌లో సేకరించిన కల్లులో కెమికల్స్ ఉన్నట్లు గుర్తించారు. కెమికల్స్ కలిపిన కల్లు వల్లే బాధితులు అస్వస్థతకు గురయ్యారని ఎక్సైజ్ అధికారులు ధృవీకరించారు. ఇప్పటికే ఈ కేసులో ఏడుగురిని ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ ఘటనపై స్పందించారు. కల్తీ కల్లు ఘటనలో నిమ్స్‌లో 31 మంది, గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఏడుగురు మొత్తం 44 మందికి మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయారని ప్రతిపక్షాలు చెబుతుంటే.. ప్రభుత్వం మాత్రం నలుగురే ప్రాణాలు కోల్పోయినట్లు చెబుతోంది. కల్తీ కల్లు ఘటనపై బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ కూడా స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు, బాధితులకు రూ. లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్తీ కల్లులో సైకో ట్రాఫిక్ సబ్ స్టన్స్ కలిపినట్లు స్పష్టంగా తెలుస్తోందని, ఎక్సైజ్ శాఖ కల్లు కాంపౌండ్ వారితో కుమ్మక్కైందంటూ ఆయన ఆరోపించారు.

# ఏ క్షణమైనా గేట్లు ఎత్తేయొచ్చు!

తెలంగాణ: భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టుకు దిగువన ఉన్న గ్రామాల ప్రజలను అధికారులు అలర్ట్ చేశారు. జూరాల నుంచి శ్రీశైలానికి, నాగార్జున సాగర్ నుంచి కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండ టంతో స్నాన ఘట్టాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం పెరిగింది.



తెలంగాణతో పాటు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దాంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలను అలర్ట్ చేశారు. గంట గంటలకు వరద ఉధృతి పెరుగుతుండటంతో ఏ క్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మందపల్లి వద్ద ఉన్న పలికేరు వాగు, కడెం నది తాటిగూడ వద్ద, చిక్ మాన్ వాగు, కుప్టి వాగు వద్ద రెయిన్ ఫాల్ గేజింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నాలుగు స్టేషన్ల వద్ద వరద ఉధృతిని అంచనా వేసి దానికి అనుగుణ ంగా నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. గేజింగ్ స్టేషన్లకు సెన్సార్లను అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు వరద ఉధృతి అంచనా వేస్తారు. గతంలో కడెం ప్రాజెక్టుకు సంబంధించిన గేట్లు మరమ్మతులు కాగా.. ప్రస్తుతం అన్ని పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టుతో పాటు మిగతా జలాశయాలన్నీ నిండు కుండలా మారాయి. ప్రియదర్శిని జూరాల జలాశయానికి లక్షా 25 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 14 గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల సహా సుంకేసుల నుంచి కూడా శ్రీశైలానికి రెండు లక్షల 13 వేల 824 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. అదేవిధంగా నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు కూడా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయం నీటి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 200 టీఎంసీల నీరు ఉంది. పై నుంచి ఎక్కువగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో 590 అడుగులకు గాను 535.7 అడుగులకు ప్రస్తుతం నీళ్లు ఉన్నాయి. భారీగా నీటి ప్రవాహం ఉండటంతో నాగార్జున సాగర్ నుంచి కాల్వలకు నీటిని వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం కూడా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి స్నాన ఘట్టాల వద్దకు వెళ్లే భక్తులు ఒడ్డున మాత్రమే స్నానాలు చేయాలని అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద కూడా జలకళ సంతరించుకుంది. మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం పెరగడంతో వచ్చిన నీరు వచ్చినట్లు కిందకు విడుదల చేస్తున్నారు.

# నా కోడి కాళ్లు విరగ్గొట్టారు సార్..

నల్లగొండ: జిల్లాలో గంగమ్మ అనే వృద్ధురాలు తన కోడిని రాకేష్ అనే వ్యక్తి కొట్టాడని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కోడి కాలు విరగడంతో ఆమె ఆగ్రహంతో ఊగిపోయింది. డబ్బులు వద్దని, రాకేష్‌కు శిక్ష పడాలని పట్టుబట్టింది. పోలీసులు పంచాయితీ పెట్టి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించినా, ఇది వారికి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ కోడి పంచాయితీ ఊరిలో హాట్ టాపిక్ అయింది.

మనుషుల కన్నా ఎక్కువగా మూగ జీవుల మీద అభిమానం పెంచుకునే వారు మన సమాజంలో చాలా మంది ఉన్నారు. తమ పెంపుడు జంతువులకు చిన్న సమస్య వచ్చినా దాని యజమాని బాధతో విలవిల్లాడతారు. ఇంకాస్త అపురూపంగా పెంచుకునే జంతువుని ఎవరైనా బాధ పెడితే అస్సలు ఊరుకోరు. తమ పెట్స్‌ని బాధపెట్టేవారికి కొందరు మాటలతో సమాధానం చెబితే కొందరు చేతలతో బదులిస్తారు. ఇప్పుడీ ముచ్చట ఎందుకు చెప్పుకుంటున్నామంటే.. తన కోడిని గాయపరిచాడని ఆరోపిస్తూ ఒక వృద్ధురాలు ఒక వ్యక్తి మీద పోలీసు కేసు నమోదు చేసింది.

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం పోలీస్ స్టేషన్‌లో కోడి పంచాయతీ వెలుగు చూసింది. నకిరేకల్ మండలం గొల్లగూడెంలో ఈ వింత సంఘటన జరిగింది. గంగమ్మ అనే వృద్ధురాలు పెంచుకున్న కోడి విషయంలో గొడవ జరిగింది. అది కాస్త చివరకు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. రాకేష్ అనే వ్యక్తి కోడిని కర్రతో కొట్టడంతో దాని కాలు విరిగింది. దీంతో గంగమ్మ నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. తన కోడిన గాయపరిచిన రాకేష్ మీద ఫిర్యాదు చేసింది.

గంగమ్మ తన కోడిని ఎంతో ప్రేమగా చూసుకునేది. ఆ కోడి రోజూ ఊరిలో తిరుగుతూ సాయంత్రానికి ఇంటికి వచ్చేది. అయితే రాకేష్ ఇంటి దగ్గర గడ్డివాములో గింజలు తింటున్నందుకు అతడు కోడిని కొట్టాడు. కోడి కాలు విరగడంతో గంగమ్మ బాధతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. రాకేష్ మీద కేసు పెట్టమని ఆమె పోలీసులను కోరింది. నా కోడిని నా కళ్లముందే కొట్టాడు. నాకు డబ్బులు వద్దు... రాకేష్‌కు శిక్ష పడాలి అని గంగమ్మ డిమాండ్ చేసింది. ఆమె మాటలు విని పోలీసులు ఆశ్చర్య పోయారు. గంగమ్మను బుజ్జగించడానికి ప్రయత్నించారు. కానీ ఆమె వినలేదు. చివరికి పోలీసులు గ్రామానికి వచ్చి పంచాయతీ పెట్టి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కోడికి ట్రీట్‌మెంట్ చేయించాలని సూచించి ఆమెను ఇంటికి పంపించారు. ఇది కేవలం కోడి గొడవ కదే అని అనుకున్నారు. కానీ ఇదే వారికి పెద్ద తలనొప్పి తెచ్చిపెట్టింది. దీని గురించి తెలిసి మరికొంత మంది ఇలాంటి కేసులే తీసుకొస్తారు.. అప్పుడేంటి పరిస్థితి అని పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సంఘటన ఆ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. కోడిని కొట్టినందకు ఏకంగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లిందంటే ఆమెకు ఆ కోటి అంటే ఎంత అభిమానమో అర్థం అవుతుంది అంటున్నారు ఈ విషయం తెలిసిన వాళ్లు.

# ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ చిత్రపటం బహూకరణ..

ఏపీ: బీజేపీ చీఫ్ మాధవ్ చేసిన పనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇదేం పని అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ట్వీట్ చేశారు. తెలంగాణ అస్థిత్వాన్ని, భౌగోళిక గుర్తింపును గుర్తించకుండా వ్యవహరించారని విమర్శించారు. దీనిపై తెలంగాణ ప్రజానీకానికి బీజేపీ అధిష్ఠానం క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు నారా లోకేష్‌కు ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ భారతదేశ చిత్రపటాన్ని బహుమతిగా ఇచ్చారు. అయితే ఇందులో తెలంగాణ లేకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చూపటంతో విమర్శలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్.. నారా లోకేష్‌కు బహూకరించిన చిత్రపటం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమవుతోంది. సోషల్ మీడియా వేదికగా ఏపీ బీజేపీ చీఫ్ చేసిన పనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీవీఎన్ మాధవ్ ఏపీ బీజేపీ చీఫ్‌గా కొత్తగా నియమితులయ్యారు బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన.. ఉండవల్లిలోని మంత్రి నారా లోకేష్ నివాసంలో లోకేష్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారతదేశ చిత్రపటాన్ని మాధవ్ నారా లోకేష్‌కు అందజేశారు. భారతదేశ సాంస్కృతిక వైభవం పేరుతో ఉన్న చిత్రపటాన్ని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్.. నారా లోకేష్‌కు అందజేశారు.

అయితే ఈ చిత్రపటంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను వేర్వేరుగా కాకుండా.. కలిపి ఆంధ్రప్రదేశ్‌గా చూపించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ట్వీట్ చేశారు. ఏపీ బీజేపీ చీఫ్ చేసిన పనికి భారతీయ జనతా పార్టీ అధిష్టానం తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.




"సాంస్కృతిక గుర్తింపు, చరిత్రలో సరైన స్థానం, భౌగోళిక గుర్తింపు కోసం తెలంగాణ ప్రజానీకం కొన్ని తరాలు పోరాటం చేసింది. కానీ ఈరోజు, మీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ చీఫ్ మాధవ్ గారు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌ను బహుమతిగా ఇచ్చి, తెలంగాణ ఉనికిని విస్మరించారు. దీని ద్వారా మా పోరాటాన్ని తక్కువ చేశారు. ఇది ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. తెలంగాణ ప్రజలకు, తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ పోరాటానికి, అమరవీరుల త్యాగాలు, చరిత్ర పట్ల స్పష్టమైన నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. మా చరిత్రను తుడిచేస్తే, ఇక మేం ఏమిటి?" అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఈ ఘటన బీజేపీ పార్టీ ప్రణాళికను తెలియజేస్తోందా లేదా రాజకీయ ఎజెండాను ప్రతిబింబిస్తుందో స్పష్టం చేయాలని ప్రధానమంత్రి మోదీని కేటీఆర్ కోరారు. తెలంగాణ అస్థిత్వాన్ని, తెలంగాణ భౌగోళిక గుర్తింపును గుర్తించకపోవటం బీజేపీ విధానమా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవేళ ఇదే కనుక పొరబాటున జరిగి ఉంటే.. తెలంగాణ ప్రజలను అపహాస్యం చేసినందుకు బీజేపీ అధిష్టానం తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలంటూ కేటీఆర్ ట్వీట్ ద్వారా డిమాండ్ చేశారు. మరోవైపు సోషల్ మీడియాలోనూ ఈ ఫోటో వైరల్ అవుతోంది.

# అకౌంట్లోకి డబ్బులు పడుతున్నాయ్..

ఏపీ: రైతులకు శుభవార్త. ధాన్యం బకాయిల డబ్బులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. గురువారం 30 వేల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 660 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ విషయాన్ని వెల్లడించారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లో ఎంతమొత్తంలో ధాన్యం సేకరించాం, ఎంతమంది రైతులకు చెల్లింపులు చేశామనే వివరాలను వెల్లడించారు.

ఏపీలోని రైతులకు గుడ్ న్యూస్.. ధాన్యం బకాయిల డబ్బులను ఏపీ ప్రభుత్వం రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేస్తోంది. ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ విషయాన్ని వెల్లడించారు. 2024-25 ఖరీఫ్, రబీ సీజన్లో ఏపీ పౌర సరఫరాల సంస్థ 2,01,934 రైతుల వద్ద నుంచి 4575.32 కోట్ల విలువైన 19,84,098 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. తెనాలి క్యాంపు కార్యాలయంలో మాట్లాడిన మంత్రి.. ఏపీ ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు బకాయిల కోసం గురువారం (జూలై 10) రూ.659.39 కోట్ల రూపాయలు.. 30,403 రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసినట్లు నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.



**2021-22 ఖరీఫ్ సీజన్‌లో 5,79,403 రైతుల నుంచి రూ. 7,846.13 కోట్లు విలువైన 40,31,652 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని..2022-23 ఖరీఫ్ సీజన్‌లో 6,39,510 రైతుల నుంచి రూ.7,222.10 కోట్లు విలువైన 35,36,136 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారని నాదెండ్ల మనోహర్ వివరించారు. 2023-24 ఖరీఫ్ కాలంలో 4,97,907 రైతుల నుంచి రూ. 6,549.15 కోట్లు విలువైన 29,97,063 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని వివరించారు.మరోవైపు వైసీపీ ప్రభుత్వం చెల్లించని ధాన్యం బకాయిలు రూ.1674.47 కోట్లు కూడా.. 84,724 మంది రైతుల ఖాతాల్లో జమచేశామని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

2024-2025 సీజన్‌లో ఇప్పటి వరకూ 4575.32 కోట్ల రూపాయలు.. 2,01,934 రైతుల ఖాతాలో జమ చేశామని.. వంద శాతం రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమచేసినట్లు వెల్లడించారు. 2021-22 రబీ సీజన్‌లో 2,29,248 రైతుల నుంచి రూ. 26,23,535 కోట్లు విలువైన 5,099.62 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారని.. 2022-23 రబీ సీజన్‌లో 1,58,784 రైతుల నుంచి రూ. 2,884.04 కోట్లు విలువైన 14,12,881 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారని వెల్లడించారు. 2023 -24 రబీ సీజన్‌లో 1,32,859 రైతుల నుంచి రూ.2,763.86 కోట్లు విలువగల 12,64,845 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారన్నారు.

ఇక ఖరీఫ్ సీజన్ విషయానికి వస్తే 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 5,65,662 మంది రైతుల నుంచి 35.94 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించారు, దీని విలువ రూ.8282.27 కోట్లు. 5,65,662 మంది రైతులకు మొత్తం రూ.8282.27 కోట్లు చెల్లంచినట్లు మంత్రి వివరించారు. మొత్తం 24.31 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించినట్లు తెలిపారు. 2021-22 ఖరీఫ్ సీజన్‌లో 5,79,403 రైతుల నుంచి రూ. 7,846.13 కోట్లు విలువైన 40,31,652 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని..2022-23 ఖరీఫ్ సీజన్‌లో 6,39,510 రైతుల నుంచి రూ.7,222.10 కోట్లు విలువైన 35,36,136 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారని నాదెండ్ల మనోహర్ వివరించారు. 2023-24 ఖరీఫ్ కాలంలో 4,97,907 రైతుల నుంచి రూ. 6,549.15 కోట్లు విలువైన 29,97,063 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని వివరించారు.మరోవైపు వైసీపీ ప్రభుత్వం చెల్లించని ధాన్యం బకాయిలు రూ.1674.47 కోట్లు కూడా.. 84,724 మంది రైతుల ఖాతాల్లో జమచేశామని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాష్ట్రంలోని రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# తల్లికి వందనం రెండో విడత డబ్బులు 10న విడుదల..

ఏపీ: ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద రెండో విడత నిధులను జూన్ 10న విడుదల చేయనుంది. మొదటి విడతలో డబ్బులు రానివారు, కొత్తగా చేరిన విద్యార్థుల తల్లులకు ఈ విడతలో రూ.13 వేలు జమ చేస్తారు. లబ్ధిదారుల జాబితాను పాఠశాలల్లో ఉంచుతారు, వెబ్‌సైట్ లోనూ చూసుకోవచ్చు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రుల సమావేశం కూడా నిర్వహించనున్నారు. ఇంటర్ విద్యార్థులు ఆధార్‌తో బ్యాంకు ఖాతా లింక్ చేసుకోవాలని కూడా అధికారులు సూచించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించింది. జూన్ 12న తొలి విడతగా ఇప్పటికే తల్లుల బ్యాంక్ అకౌంట్‌లలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి.. ఒక్కొక్కరికి రూ.13వేల చొప్పున జమ చేసిన సంగతి తెలిసిందే. అయితే తొలి విడతలో పలు కారణాలతో కొందరికి డబ్బులు జమ కాలేదు.. అలాగే ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో చేరేవారికి కూడా డబ్బుల్ని ఇవ్వలేదు. ప్రభుత్వం తల్లికి వందనం పథకం తొలి విడతలో డబ్బులు రాని వారు మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది.. ఆ అప్లికేషన్‌లను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేసింది. అలాగే ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో చేరినవారి లిస్ట్‌ను కూడా రెడీ చేసింది. మంగళ,



ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తల్లులకు డబ్బులు విడుదల చేస్తారు. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సీబీఎస్ఈ విద్యా సంస్థల్లో చదువుతున్న 9.51 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నెల 10న తల్లికి వందనం నగదు జమ చేయనుంది. వివిధ కారణాల వల్ల నగదు అందని వారి దరఖాస్తుల్ని పరిశీలించిన ప్రభుత్వం అర్హత ఉన్నవారికి కూడా డబ్బులు జమ చేయనుంది. మొత్తం 7,99,410 మంది విద్యార్థులకు గాను 7,84,874 మంది తల్లుల ఖాతాల్లో రూ.13 వేల చొప్పున జమ చేస్తారు. మొదటి విడతలో కొందరు అర్హులైనప్పటికీ డబ్బులు రాలేదు.. వారు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు వారి సమస్యలను పరిష్కరించారు. అర్హులుగా తేలిన 1.34 లక్షల మందికి కూడా ఇప్పుడు తల్లికి వందనం డబ్బులు జమ చేస్తారు.

స్కూళ్లకు సంబంధించి అర్హులైన తల్లుల జాబితాలను నేరుగా టీచర్ల లీప్ యాప్‌లో పొందుపరుస్తారు. వీరందరికి ఈ నెల 10న అకౌంట్‌లలో డబ్బుల్ని జమ చేస్తారు. అర్హుల జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు ప్రభుత్వ వెబ్‌సైట్ https://gsws-nbm.ap.gov.inఅందుబాటులో ఉంచింది.. ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ApplicationStatusCheckP క్లిక్ చేయాలి.. అప్పుడు ఏ పథకమో (తల్లికి వందనం) సెలక్ట్ చేసుకోవాలి. ' ఆ పక్కనే ఉన్న 2025-26ను సెలక్ట్ చేసుకున్న తర్వాత ఆధార్ నెంబర్, క్యాప్చాను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అనంతరం గెట్ ఓటీపీపై క్లిక్ చేస్తే.. పథకానికి సంబంధించి లింక్ చేసిన మొబైల్ నంబర్‌కు ఓ ఓటీపీ వస్తుంది.. దానిని ఆ కాలమ్‌లో ఎంటర్ చేసి సబ్మిట్ చేయగానే తల్లికి వందనం పథకం అప్లికేషన్ స్టేటస్ తెలుసుకోవచ్చు' అంటున్నారు.

ఈ నెల 10న రెండు విశేషాలు ఉన్నాయి.. ఒకటి తల్లికి వందనం పథకం రెండో విడత డబ్బుల్ని ప్రభుత్వం బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేయనుంది. రెండోది రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పీటీఎం) నిర్వహించనున్నారు. ఒకే రోజు పీటీఎంతో పాటుగా తల్లికి వందనం డబ్బులు కూడా తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇదిలా ఉంటే.. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫస్టియ్ చదువుతున్న ఎస్సీ విద్యార్థుల్ని అధికారులు అలర్ట్‌చేశారు. ఈనెల 10న తల్లికి వందనం రూ.13వేలు తల్లుల బ్యాంకు అకౌంట్‌లలో జమ చేస్తారని.. కాబట్టి బ్యాంకు అకౌంట్‌ను, ఆధార్ నంబరుకు ఎన్ పీసీఐ లింక్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఒకవేళ బ్యాంక్ అకౌంట్ లేకపోతే తప్పనిసరిగా బ్యాంకు ఖాతా , లేని పక్షంలో పోస్టాఫీసు ఖాతాను తెరిచి ఆధార్ నంబరుకు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలి అని సూచించారు.

# దుస్తులు ఆరవేయలేదని మందలింపు..

ఏపీ: క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎంతటి విషాదాన్ని నింపుతాయో తెలిపే కథ ఇది. కొత్తపేటలో ఉతికిన దుస్తులు ఆరవేయలేదని భర్త మందలించడంతో మనస్తాపం చెందిన పావని అనే ఇల్లాలు బలవన్మరణానికి పాల్పడింది. దీంతో రెండేళ్ల చిన్నారి తల్లిలేని బిడ్డగా మిగిలిపోయింది. మరోవైపు, కుటుంబ కలహాలతో విసిగిపోయిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా పోలీసులు కాపాడారు.

క్షణికావేశం.. మనిషిని విచక్షణ కోల్పోయేలా చేస్తోంది. ఆ క్షణంలోనే కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు కారణమవుతోంది. యువతలోనే ఈ లక్షణం ఎక్కువగా ఉందనుకుంటే.. ఇప్పుడు పెళ్లైన వారూ ఇలాగే వ్యవహరిస్తున్నారు. భర్త కొట్టాడనే, భార్య తిట్టిందనే నిందు జీవితాన్ని బలి తీసుకుంటున్నారు. ఫలితంగా కన్నవారు, కట్టుకున్నవారు, కడుపున పుట్టినవారికి తీవ్ర వేదనను, మానసిక క్షోభను కలిగిస్తున్నారు. అలాంటి ఘటనే అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో చోటుచేసుకుంది. ఉతికిన బట్టలు ఆరవేయలేదని భర్త తిట్టాడని.. ఆత్మహత్య చేసుకుందో ఇల్లాలు. కొత్తపేట మండలం బాబానగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లాలోని కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన నాగరవీంద్ర అనే వ్యక్తి... రావులపాలెంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. నాగరవీంద్ర బాబానగర్‌లో నాలుగు నెలలుగా అద్దెకు ఉంటున్నారు. నాగరవీంద్ర భార్య పావనిది కూడా అదే ఊరు. నాగరవీంద్ర, పావని దంపతులకు రెండేళ్ల కుమార్తె ఉంది. అయితే మంగళవారం డ్యూటీకి వెళ్లిన నాగరవీంద్ర.. మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటికి వచ్చాడు. రాగానే ఉతికిన దుస్తులు ఆరవేయలేదని భార్య పావనిని మందలించాడు.

భర్త మందలించటంతో పావని మనస్తాపానికి గురైంది. పక్క గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన నాగరవీంద్ర చుట్టుపక్కల వారి సహాయంతో పావనిని రక్షించే ప్రయత్నం చేశాడు. తలుపులు పగులకొట్టి లోపలికి ప్రవేశించిన నాగరవీంద్ర.. పావనిని వెంటనే కొత్తపేట ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆలస్యం జరిగిపోయింది. పావనిని పరీక్షించిన కొత్తపేట ప్రభుత్వాసుపత్రి వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. దీంతో అమ్మ క్షణికావేశంలో చేసిన పనికి.. రెండేళ్ల చిన్నారి తల్లి ప్రేమకు దూరమైంది. మరోవైపు పావని తండ్రి నాగేశ్వరరావు బుధవారం ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మరోవైపు కుటుంబ సభ్యుల మీద కోపంతో చనిపోవాలనుకున్న ఓ వ్యక్తిని రావులపాలెం పోలీసులు కాపాడారు. ఇంట్లో వారి మీద కోపంతో పురుగుల మందుతో వెళ్లిన వ్యక్తిని రక్షించారు. గోపాలపురానికి చెందిన లలితసాయి రమేష్ కుటుంబ సభ్యుల మీద కోపంతో పురుగు మందు డబ్బా తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో అతని తండ్రి పోలీసులకు సమాచారం అందించగా.. వారు గాలించి రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు.

# కావాలంటే అరెస్ట్ చేస్కోండి



ఏపీ: వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను పారిపోయానని కొంతమంది ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను ఎక్కడకు పారిపోలేదని కావాలంటే ఇప్పుడే అరెస్ట్ చేసుకోవచ్చని సవాల్ విసిరారు. తనది నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి బ్లడ్ అని.. భయమనేది తమ బయోడేటాలో లేదంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. మరోవైపు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే.

టీడీపీ నేత, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యల ఆరోపణలపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. త్వరలోనే ఆయనకు నోటీసులు జారీ చేసి విచారణకు పిలుస్తారని వార్తలు వచ్చాయి. అలాగే ఆయన పారిపోయారంటూ ప్రచారం కూడా జరిగింది. ఈ క్రమంలోనే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గురువారం నెల్లూరులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాను పారిపోయాననే ప్రచారాన్ని ఆయన ఖండించారు. చేతికి నొప్పి ఉండటంతో చెన్నై ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవటానికి వెళ్లినట్లు క్లారిటీ ఇచ్చారు. అయితే తాను పారిపోయానంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

తనది నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి రక్తమని.. భయపడటమనేది తమ బయోడేటాలో లేదంటూ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను నెల్లూరు వదిలి వెళ్లానని అనడం హాస్యాస్పదమని.. కావాలంటే ఇప్పుడైనా తనను అరెస్ట్ చేసుకోవచ్చంటూ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఓపెన్ ఛాలెంజ్ చేశారు. నెల్లూరులోని తమ ఇంటిపై దాడికి సంబంధించిన వీడియో ఆధారాలు ఉన్నాయని..పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

మరోవైపు వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు చేపట్టారు. మహిళా సంఘాలు, కూటమి పార్టీలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి సంఘీభావంగా నిలిచాయి. ఇదే సమయంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తనను అసభ్య పదజాలంతో దూషించిన ప్రసన్నకుమార్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే కోవూరులో కూడా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై కేసు నమోదైంది.

అయితే ఈ పరిణామాల తర్వాత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కనిపించకుండా పోవటంతో ఆయన పారిపోయారంటూ ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే నెల్లూరులో విలేకర్ల సమావేశం నిర్వహించిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పారిపోయే ప్రసక్తే లేదని.. కావాలంటే అరెస్ట్ చేసుకోవచ్చంటూ ఓపెన్ ఛాలెంజ్ చేశారు.

# తిరుపతి వెళ్లే వారికి అలర్ట్..

అనంతపురం: జిల్లా ప్రజలకు గమనిక! జూలై 11న కదిరిదేవరపల్లి-తిరుపతి రైలు రద్దు చేశారు. రాయదుర్గం-సోమలాపురం మధ్య ట్రాక్ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, జూలై 12 నుండి రైలు యథావిధిగా నడుస్తుందని అధికారులు తెలిపారు. తిరుపతి వెళ్లే ప్రయాణికులు ఈ మార్పును గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా నుంచి తిరుపతికి వెళ్లే వారికి ముఖ్య గమనిక. జూలై 11న కదిరిదేవరపల్లి - తిరుపతి రైలు రద్దు అయ్యింది. ట్రాక్ పనుల నేపథ్యంలో కదిరిదేవరపల్లి - తిరుపతి రైలును జూలై 11న రద్దు చేసినట్లు కళ్యాణదుర్గం రైల్వేస్టేషన్ అధికారులు వెల్లడించారు. రాయదుర్గం-సోమలాపురం మధ్య రైల్వే ట్రాక్ పనులు జరుగుతున్నాయని.. ఈ కారణంగానే జూలై 11వ తేదీ కదిరిదేవరపల్లి - తిరుపతి రైలు రద్దు చేసినట్లు తెలిపారు. అయితే జూలై 12 నుంచి ఈ రైలు యథాతథంగా సేవలు అందిస్తుందని వెల్లడించారు. కదిరిదేవరపల్లి తిరుపతి ప్యాసింజర్ రైలు వారంలో అన్ని రోజులు అందుబాటులో ఉంటుంది 57478 నంబర్‌తో కదిరిదేవరపల్లి నుంచి తిరుపతికి రోజూ అందుబాటులో ఉంటుంది.




కదిరిదేవరపల్లిలో మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాలకు బయలుదేరే ఈ రైలు.. మరుసటి రోజు ఉదయం 3 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. దాదాపు 536 కి.మీ. దూరాన్ని 12 గంటల 25 నిమిషాల్లో చేరుకుంటుంది. ఈ రైలు మొత్తం 44 స్టేషన్లలో ఆగుతుంది, గుంతకల్, ధర్మవరం జంక్షన్‌లలో ఎక్కువ సమయం ఆగుతుంది. కదిరిదేవరపల్లి తిరుపతి రైలు ప్యాసింజర్ కావటంతో.. తిరుపతికి వెళ్లాలనుకునే మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఈ రైలు ద్వారా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అనంతపురం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల వంటి ప్రధాన స్టేషన్ల మీదుగా ఈ రైలు రాకపోకలు సాగిస్తుంది. మరోవైపు అనంతపురం జిల్లా నుంచి తిరుమల శ్రీవారి దర్శనం కోసం వెళ్లే భక్తులు ఎక్కువ మంది కదిరిదేవరపల్లి తిరుపతి ప్యాసింజర్ రైలు ద్వారా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. అలాగే తిరుపతి నుంచి తిరిగి వచ్చేందుకు కూడా ఈ రైలు అందుబాటులో ఉంటుంది. అయితే ట్రాక్ పనుల నేపథ్యంలో జూలై 11న కదిరిదేవరపల్లి - తిరుపతి రైలు రద్దు చేశారు. దీంతో ఆ రోజు తిరుపతికి ప్రయాణాలు ప్లాన్ చేసుకున్న వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జూలై 12 నుంచి యథావిధిగా ఈ రైలు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

మరోవైపు అనంతపురం బెంగళూరు మధ్య ఇటీవల ప్యాసింజర్ రైలు అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. పుట్టపర్తి ప్రశాంతి నిలయం నుంచి ఉన్న రైలును అనంతపురం వరకూ పొడిగించారు. దీంతో కేవలం రూ.50 లతోనే బెంగళూరుకు వెళ్లే వెసలుబాటు ఈ ప్రాంతవాసులకు కలిగింది. దీంతో అనంతపురం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చెత్త వేయండి.. ఉచితంగా సరుకులు పట్టుకెళ్లండి..

ఏపీ: స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఏపీ ప్రభుత్వం.. ఈ కార్యక్రమం స్ఫూర్తిని పల్లెలకు సైతం విస్తరింపజేసేందుకు కొత్త ఆలోచన చేసింది. అందులో భాగంగా స్వచ్ఛ రథం కార్యక్రమానికి ఏపీ పంచాయతీరాజ్ శాఖ శ్రీకారం చుట్టింది. గుంటూరు గ్రామీణం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. స్వచ్ఛ రథం వద్ద చెత్త అందించిన వారికి.. ఆ చెత్తకు సమానమైన నిత్యావసర సరుకులను ఉచితంగా అందిస్తారు.

ప్రజలకు ఆరోగ్యవంతమైన, సౌకర్యవంతమైన జీవనం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్వచ్ఛభారత్ కార్యక్రమం స్ఫూర్తితో ఏపీ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రవేశపెట్టింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అరికట్టాలనే ఉద్దేశంతో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి నెల మూడో శనివారం మున్సిపాలిటీలు, పట్టణాలలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపడుతున్నారు. అయితే స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని పల్లెల్లోకి కూడా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఏపీ పంచాయతీరాజ్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

అందులో భాగంగా స్వచ్ఛ రథాలను తీసుకువచ్చారు. ఈ స్వచ్ఛ రథం ద్వారా పల్లె ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలను సేకరిస్తారు. ప్రజలు ఎంతమేర చెత్త, వ్యర్థాలను తీసుకువచ్చారో లెక్కగట్టి.. అందుకు సమానంగా 20 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందిస్తారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమాన్ని తొలుత గుంటూరు గ్రామీణ మండలంలో అమలు చేస్తున్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జెడ్పీ ఛైర్‌పర్సన్ హెని క్రిస్టినా గుంటూరు గ్రామీణ మండలం లాలుపురం పంచాయతీలో వీటిని ప్రారంభించారు.

స్వచ్ఛ రథం కాన్సెప్టులో భాగంగా.. ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ స్వచ్ఛ రథం మండలంలోని అన్ని గ్రామాలను చుట్టివస్తుంది. స్వచ్ఛ రథం ఇంటి వద్దకు వచ్చిన సమయంలో ప్రజలు తమ ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను వాటికి కేటాయించిన డబ్బాలలో వేయాలి. ఆ వ్యర్థాల బరువును లెక్కగట్టి వాటికి సమానమైన నిత్యావసరాలు ఉచితంగా అందిస్తారు. చెత్త, వ్యర్థాల రకాన్ని అనుసరించి కిలోకి రూ. 16 నుంచి రూ. 20 వరకు లెక్కించనున్నారు.

15 ఏళ్ల విద్యార్థికి శాపంగా.. 20 ఏళ్లుగా




పరిష్కారం దొరకని సమస్య.. ప్రాణభిక్ష పెట్టండి సారూ అంటూ అభ్యర్థన

ఎన్ని కిలోలు బరువు తూగితే.. ఆ లెక్కన లెక్కగట్టి అందుకు సమానంగా నిత్యావసర వస్తువులు అందిస్తారు. గాజు సీసాలు, ప్లాస్టిక్ సీసాలు, పాత పేపర్లు, ప్యాకెట్లు, కవర్లు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వంటి వాటిని స్వచ్ఛరథం సిబ్బందికి అందించి.. నిత్యావసరాలు తీసుకోవచ్చు.పల్లెలలో కూడా స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని రగిలించాలనే ఉద్దేశంతో ఏపీ పంచాయతీరాజ్ శాఖ ఈ సరికొత్త ఆలోచన చేసింది.

# జనాభా నియంత్రణ తక్షణావశ్యకత !

ప్రతి ఏటా జూలై 11వ తేదీన 'ప్రపంచ జనాభా దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు. ప్రపంచ జనాభా ఇప్పటికే 800 కోట్లు దాటింది. భారతదేశ జనాభా అధికారికంగా 140కోట్లకు చేరుకుంది. ఇందులో పెరుగుదలే తప్ప తక్కు ఉండదని చెప్పొచ్చు. జనాభా పెరుగుదలతో పాటు కనీస వసతులు, వనరులు లేకపోవడంతో భారతదేశం ఇంకా పేదరికంలోనే మగ్గుతోంది. ఇకపోతే ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలకు, తరుగు దలకు సంబంధించిన విషయాల గురించి ప్రజలలో చైతన్యం తెచ్చేందుకుగాను ఐక్యరాజ్యసమితి 1989వ సంవత్సరంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రారంభించింది. జనాభా నియంత్రణ అన్నది ఎవరికి వారు నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉంది. ఆయా దేశాలు తమ దేశాల వనరుల ఆధారంగా నియంత్రణ చర్యలు పాటించాలి.నియంత్రణ లేకపోవడంతో ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగి పోతున్నది. పెరిగిన జనాభా వలన పలు ప్రపంచ దేశాలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ప్రజలకు కనీస మౌలిక సదుపా యాలు కల్పించ లేక సతమతమ వుతున్నాయి. విద్య,వైద్యం,ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుధ్యం వంటి అనేక అంశాల్లో ప్రభుత్వాలు ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నాయి. పెరుగుతున్న జనాభా కారణంగా కనీస వసతుల కల్పన ఏ ప్రభుత్వాని కైనా తలకుమించిన భారంగా మారుతోంది. గృహకల్పన, అక్షరాస్యత, నిరుద్యోగం, పౌష్ఠికాహారం, ఉద్యోగ కల్పన వంటి అంశాలు విషమ సమస్యలుగా మారాయి. ప్రకృతి వైపరీత్యాలతో అనేక దేశాలు సతమతమవు తున్నాయి. చాలా దేశాల్లో ఈనాటికీ కనీస విద్య గగకుసుమంలా మారింది. ఆహార సమస్యతో అనేక దేశాలు అలమటిస్తున్నాయి. మనదేశంలో త్వరలోనే జగనగణన జరుగనుంది. ఈ క్రమంలో ఈ వానాకాల పార్లమెంట్ సమావేశంలో మన ప్రతినిధులు దీనిపై చర్చించాలి. ఇప్పటికే 140 కోట్లకు జనాభా చేరుకున్న క్రమంలో జనాభా నియంత్రణపై దృష్టి సారించాలి. లేకుంటే భారతదేశ వనరులు బతకడానికి సరిపోవు. జనభా నియంత్రణపై ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చైనాలాగా జనాభా నియంత్రించకపోతే రానున్నరోజుల్లో బతకడం దుర్లభంగా మారనుంది. చాలా దేశాలు దీన్ని పట్టించుకోక పోవడం వల్ల అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. జన విస్ఫోటనంతో ఎన్ని రకాల విపరీత పరిణామాలు జరగాలో అన్నీ జరుగుతన్నాయి. పర్యావరణ విపరీత పరిస్థితుల కారణంగా అధిక వర్షాలు లేదా, అస్సలు వర్షాలు పడక పోవడం, వనరులన్నీ తగ్గిపోవడం వంటి విపరీత పరిణామాలు చూస్తున్నాం. ఆహారధాన్యాల కొరత ఏర్పడనుంది. ప్రకృతి విధ్వంసం జరిగింది. ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. ఇలా ఎన్నో విపరీత పరిణామాలు చూస్తున్నాం. అవన్నీ అనుభవంలోకి స్తున్నాయి. ఎన్ని దుష్ప్రభావాలు కలగాలో కలుగుతున్నాయి. ఉన్న వనరుల విధ్వంసం జరిగింది. జనాలకు సరిపడా ఆహారధాన్యాలు అందడం లేదు. పంటలు తక్కువ....తినేవారు ఎక్కువయ్యారు. నిరుద్యోగం తాండవిస్తోంది. నానాటికి ప్రపంచంలో జనాభా పెరుగుతోంది. నానాటికి పెరుగుతున్న జనాభా..తద్వారా తలెత్తే దుష్పరి ణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు పూనుకోవాలి. పల్లెలు, పట్టణాలు, నగరాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. హోటళ్ళు, సినిమా హాళ్ళు, షాపింగ్ మాల్స్, కూరగాయల మార్కెట్లు, హాస్పటల్స్.. ఇలా ఒకటేమిటి బ్యాంకుల నుండి బట్టల దుకాణాల వరకు ఎక్కడ చూసినా జనం. ఇసుక వేస్తే రాలనంత మంది జనంతో ప్రతీ ప్రాంతం కిటకిట లాడుతున్నది. దీంతో నివాస స్థలాలు కూడా భారంగా మారయి. ఇల్లు అందరికీ హక్కు అన్నది పోయి అదో కలగా మిగిలింది. అగ్ర రాజ్యాలు సైతం ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి... అన్నింటికి మించి ఆరోగ్య రంగంలో ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రపంచంలోని అనేక దేశాలు వెనుకబడి ఉన్నాము.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సహస్రాబ్ది లక్ష్యాలను కూడా చేరుకోలేదు. అందరికీ ఆరోగ్యం అన్న లక్ష్యానికి ఇంకా దూరంగా వుండడానికి అధిక జనాభాయే కారణం. అయితే కొన్ని అంశాలలో అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని చెప్పుకుంటున్నా...నేటికీ సామాన్యులకు అది కలగానే మిగిలింది. ఫార్మా, వ్యాక్సిన్ల రంగాల్లో ముందంజ వేస్తున్నా..జనాభాకు సరిపడా అందించలేని దుస్థితిలో ప్రపంచం ఉంది. మొత్తం మీద అధికా జనాభా ప్రధానంగా ఆరోగ్యరంగం అసమానతలకు కారణంగా మారింది. ఆధునిక జీవన శైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్లతో మూడు ప్రధాన సమస్యలు మానవాళిని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం రక్తపోటు, షుగర్ అనేవి చాలా సాధారణంగా మారిపోయాయి. కేవలం నగరాలు, పట్టణాలు కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. కేవలం పని ఒత్తిడి కారణంగా ఈ జబ్బులు వస్తున్నాయన్నది సుస్పష్టం. సరైన ఆహారం తీసుకోకపోవడం, చిన్నారులు ఎక్కువగా ఎలక్ట్రానిక్ పరికరాలకు అలవాటు పడడం కారణాలుగా ఉన్నాయి. భారతదేశంలో ఊబకాయం కేసులు వేగంగా పెరుగుతున్నాయి. దీని కారణంగా ప్రజలు తీవ్రమైన వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఊబకాయం అనేది చిన్న సమస్య కాదని, ఇది ఒక వ్యాధిగా వృద్ధి చెందుతుందని చెప్పింది. స్థూలకాయం అంటే శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉండట మని నిర్వచించారు. ఆకలిని అధిగమించేందుకు అడ్డమైన గడ్డీ తినడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి వారికి సకాలంలో వైద్యం

అందించాలన్నా ఖరీదుగా మారింది. ప్రపంచంలో జనాభా పెరుగుదలను కట్టడి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వాలు లేకపోవడం ఈ దారుణానికి కారణంగా చూడాలి. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు జనాభా నియంత్రణపై దృష్టి పెట్టడం లేదు. దీంతో పెరుగుతున్న జనాభాతో వనరులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇది సకాలంలో చర్చించాల్సిన అతిపెద్ద సమస్యగా చూడాలి.

# నదీజలాల సద్వినియోగంపై చర్చించాలి !

### పరస్పర అవగాహనతో కార్యాచరణ

### వృధా నీటిపై చర్చలతోనూ సత్ఫలితాలు



అమరావతి/హైదరాబాద్: ఇరు రాష్ట్రాల మధ్య నదీజలాల విషయంలో స్పష్టమైన అవగాహనకు రావాల్సి ఉంది. నదీజలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ఉమ్మడిగా ప్రాజెక్టుకులను నిర్మించుకోవడం, నిర్వహించుకోవడం అవసరం.అలాగే వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో ఇరు ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వాననీటిని వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రణాళికలు సిద్ధంచేయాలి. ఇటీవల కృష్ణా,గోదవారి బోర్డుల్లో పరస్పర ఫిర్యాదులతో నీటి పంచాయితీలను కొనసాగించారు. తాజాగా బనకచర్ల పేరుతో పంచాయితీ మొదలయ్యింది. ఇలా ఎవరిక వారు కాకుండా, కలసి నదీజలాల సద్వినియోగంపై ఇరు రాష్ట్రాలు చర్చించాలి. ఉమ్మడి ప్రయోజనాలు ఆశించాలి. పరస్పర నిందలతో లాభం లేదని గుర్తించాలి కృష్ణ, గోదావరిల నుంచిచుక్కనీరు సముద్రంలో కలవకుండా చూసుకోవాలి. అంతేత్ప రాజకీయప్రయోజనాల కోసం పరస్పరం దుమ్మెత్తి పోసుకోవడం తగదు. ఇది వాంఛనీయం కూడా కాదు. ఇటీవల మరోమారు

తెలుగు రాష్ట్రాల సిఎంలు కూర్చుని విభజన సమస్యలను ప్రస్తావించారు. పరస్పర అవగాహనతో ముందుకు పోతామని ప్రకటించారు. అదే సందర్భంలో జలవనరుల విసయంలో పరస్పర అవగాహన అవసరం. సున్నితమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావం ఉండాలే తప్ప రెచ్చగొట్టే విధానాలు సరికాదు. విపక్షాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే పరిస్థితి రాకుండా చూడాలి. ఉభయ ప్రభుత్వాలు వీలున్నంత త్వరగా సామరస్యంగా జల వివాదాలను పరిష్కరించుకుని ఇటు రాయలసీమ అటు తెలంగాణలోని కరువు ప్రాంతాలకు నీటిని తరలించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. ఇందులో ప్రదానంగా గోదావరి, కృష్ణాల నుంచి వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటిని వినియోగించడంపై నిపుణులతో చర్చించాలి. విభజనకు ముందువరకు కలసి వున్న మనం ఇప్పుడు జగడాలు పడడం తగనిపనిగా పాలకలు,రాజకీయ పార్టీలు,నేతలు గుర్తించాలి. సమస్యలను ఎగదోసే రాజకీయ పార్టీల నేతల తీరును ఎండగట్టాలి. పొరుగు రాష్ట్రాలతో గొడవలు వద్దనుకుంటున్న ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు ఈ విషయంలో హుందాగానే ఉంటున్నందున సమిష్టిగా సమస్యలను పంచుకోవాలి. తెలంగాణ మంత్రులు కూడా సంయమనంతో సమస్యలను చర్చించాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో మన బంధాలు బలపడాలి. ప్రభుత్వాలు తమ వాటా నికర జలాలకు కట్టుబడి ఉంటూ, మిగులు జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప భావోద్వేగాలు రెచ్చ గొట్టడం వాంఛనీయం కాదు. నిజానికి కృష్ణా,గోదావరి చివరి బేసిన్‌లో ఉన్నవి తెలుగు రాష్ట్రాలే. ఈ రెండు రాష్ట్రాలు ఈ నీటిని ఎలా ఉపయోగించుకోవాల అన్నది నిర్ణయించుకోవాలి. దీనిద్వారా ఇరు రాష్ట్రాల రైతాంగం బాగుపడుద్ది. సముద్రంలోకి నీరు వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రాజెక్టులను నిర్మించకునే అవకాశాలను పరిశీలించాలి. ఘర్షణల వల్ల నష్టపోయేది రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలే అని గమనించాలి.కేంద్రం కూడా బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం కానరావడం లేదు. సమస్యలను పెద్దవిగా చేయకుండా పరిష్కరించే మార్గాలను చూపుతూ శాశ్వతంగా సమస్యలకు చెక్ పెట్టగలగాలి. ఆల్మట్టి,నారాయణపూర్ ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నది కిందనున్న ప్రాజెక్టులకు ఇప్పటికే నీరు సక్రమంగా అందడం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక, మహారాష్ట్రలకు కేటాయించిన అదనపు జలాలను వారు వినియోగించుకుంటే ఉభయ తెలుగు రాష్ట్రాలకు మిగులు జలాలు కాదుకదా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలకు కూడా గ్యారంటీ ఉండదు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కృష్ణాజలాల్లో తమ వాటాగా ఉన్న నికరజలాలకు గ్యారంటీని పొందడంతో పాటు బచావత్ ట్రిబ్యునల్ చెప్పిన పద్ధతిలో మిగులు జలాలను వినియోగించుకునే హక్కును తెలుగు రాష్ట్రాలు కాపాడు కోవాలి. ఇందుకోసం ముందుగా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర విశ్వాసం, అవగాహన ఉండాలి. ఇరు రాష్ట్రాలు ఉమ్మడిగా కేంద్ర పెత్తనాన్ని ఎదుర్కోవలసి ఉంది. ఎవరివాటాలను వారు వాడుకునే విధంగా నడుచుకోవాలి. వివాదాన్ని కేంద్రమే పరిష్కరించాలని కోరడమనేది శత్రువుకు జుట్టు ఇచ్చినట్లు అవుతుంది. నీటి సమస్యలు భావోద్వేగాలను తీవ్రతరం చేయడం సరికాదు. అనేక సమస్యలను పరిష్కరించ లేని కేంద్రం ఇక జల వివాదాలను సరిదిద్దుతుందన్న నమ్మకం లేదు. అందువల్ల ఉన్న ఒప్పందాల మేరకు నడుచుకునే విధంగా తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూర్చుని మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. పోతిరెడ్డిపాడు నుంచి కిందకు పూర్తిస్థాయిలో నీరు రావాలంటే శ్రీశైలంలో 881 అడుగులు నీళ్ల ఉండాలి. శ్రీశైలంలో పూర్తి నీటి మట్టం 885 అడుగుల నీళ్ల ఉన్న రోజులు గత 20 ఏళ్లలో ఏడాదిలో 20 నుంచి 25 రోజులు కూడా లేవు. ఇలాంటి సమయంలో పోతిరెడ్డిపాడుకు పూర్తి స్థాయిలో

నీటిని తీసుకెళ్లలేని పరిస్థితి. మరోవైపు పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టు, కల్వకుర్తి సామర్థ్యం పెంచి 800 అడుగులలోపే నీటిని తీసుకునే వెసులుబాటు తెలంగాణకు ఉందంటున్నారు. 796 అడుగుల వద్దే తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 800 అడుగుల్లోపు లోనే మీకు కేటాయించిన నీటిని వాడుకుంటే తప్పులేనప్పుడు.. 881 అడుగులు ఉంటే తప్ప నీళ్ల వాడుకోలేని పరిస్థితి మాకున్నప్పుడు.. మేం 800 అడుగుల వద్దే మాకు కేటాయించిన నీటిని తీసుకోవడంలో తప్పేముందని ఎపి అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ విషయాలపై స్పష్టత రావాలి. అలాగే రాజకీయంగా మరిన్ని చర్చలు చేయాలి. ఈ క్రమంలో నదీ జలాల పంపిణీ, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ విషయమై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరింత లోతుగా చర్చలు సాగాలి. నిజానికి సమస్య ఎక్కడుందో ఆలోచించాలి. ప్రజలకు తాగునీరు, సాగు అవసరాలు, జల విద్యుత్తు, పారిశ్రామిక అవసరాలు... ఇలా నీటి వినియోగ ప్రాధాన్యతలు అంతర్జాతీయ సూత్రాలకు అనుగుణంగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆయా నియమాలను పాటిస్తూ, ఏవైనా ప్రత్యేక పరిస్థితులు ఏర్పడితే సర్దుబాటు చేసుకొని పరస్పరంగీకారంతో ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించుకోవాలి. అప్పుడు కృష్ణా, గోదావరుల్లో మనకు ఉన్నంత నీరును సద్వినియోగం చేసుకోవచ్చు.

# వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

### మలేరియా,డెంగ్యూల ప్రభావం




శ్రీకాకుళం: యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, భౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి

డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాటులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తు ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ

గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

# అటవీ సంపదను పునరుద్ధరణకు చర్యలు




### ప్రతి ఒక్కరూ కనీసం 20 మొక్కలు నాటాలి

### అప్పడే లక్ష్యం చేరుకోగలం

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అధికారులు తెలిపారు. కేవలం ప్రభుత్వం ద్వారానే ఇది విజయవంతం కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అటవీ అధికారులు అన్నారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. ఆదిలాబాద్ జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్క డ అల్ప వర్షాపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వాలు మొక్కలు నాటే కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఏటా లక్షలాది మొక్కలను నాటుతూ పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసే లా చూస్తోంది. ఈసారి వర్షాలు అంచనాలకు తగ్గట్లుగా కురిస్తే నాటిన మొక్క ల్లో 70నుంచి 80శాతం మొక్కలు బతికే వీలుంది. ఈసారి భారీగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం భారీగా చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవంతులైన ప్రజలు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములైతే సంకల్పం నెరవేరినట్లేనని అధికారులు భావిస్తున్నారు. టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామాయిల్ తదితర రకాల మొక్కలు కొద్ది రోజుల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి. మొక్కలు నాటడంలో కొన్ని శాఖలు విఫలం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి మా త్రం అలాంటివి పునరావృతం కాకుండా పటిష్టవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. నాటిన మొక్కలను బతికించుకునేందుకు ప్రభుత్వం ఈసారి ప్రత్యేకంగా దృష్టి సారించింది. వానలు సంవృద్ధిగా కురిసే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో నాటిన మొక్కలకు జీవం పోసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని అటవీ అధికారులు తెలిపారు. పర్యావరన హితం కోసం మొక్కలు నాటడడంలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని అన్నారు. ఇది లాభాపేక్ష లేని కార్యక్రమంగా చూడాలన్నారు. వర్షాలు సకాలంలో రావాలన్నా ప్రజలంతా మొక్కల పెపంపకంలో భాగస్వాములు కావాలన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పది కాలాల పాటు మేలు కలిగేలా ఉండే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చదనం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే అథారిటీ వారికి అటవీ శాఖ వారు మొక్కలు నాటడం చేపడుతారని తెలిపారు. నేషనల్ హైవే వెంబడి మొక్కలు పెద్ద ఎత్తున నాటడం జరుగుతుందని తెలిపారు.

# గురువు అంటే జ్ఞాన ప్రసాదం !


**తిరుమల:** గురు పౌర్ణమి.. అంటే జ్ఞానాన్ని ప్రసాదించే గురువులకు కృతజ్ఞతగా జరుపుకునే పవిత్ర పండుగ. భారతీయ సనాతన ధర్మంలో తల్లి, తండ్రి తర్వాత అత్యంత గౌరవనీయ స్థానం గురువుకే దక్కుతుంది. తల్లిదండ్రుల వద్ద మనం కేవలం కొన్ని విషయాలు మాత్రమే నేర్చుకుంటాం కానీ, మిగిలినదంత గురువు దగ్గరే ఎక్కువగా నేర్చుకుంటాం. అందుకే గురువును.. 'గురు బ్రహ్మ.. గురు విష్ణు.. గురు దేవో మహేశ్వరః, గురు సాక్షాత్ పర బ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః' అని కొనియాడుతారు.మనిషి ఎంతగా పాజిటివ్ థింకింగ్ చేస్తే..మన శరీరంలోని అవయవాలు అంతగా అనుకూలంగా ప్రతిస్పందిస్తాయి. లేకంటే వ్యతిరేక దిశలో పనిచేస్తాయి. ఇది అనుభవంతో పాటు, ఆచరణలో తెలుసుకున్న విషయాలు. ఇవన్నీ కూడా మనకు విద్యద్వారా గురువు తెలియచేస్తారు. కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ కూడా మన ఆరోగ్యాన్ని దెబ్బతీసే శతృవులు. సంవత్సరాలుగా ఇవి మనలోనే ఉంటే... మనం శరీరం మందులకు లొంగని వ్యాధిగా తయారవుతుంది. మన శరీరంలోకి అధిక మొత్తంలో ప్రాణశక్తిని చేర్చే ఏకైక మార్గం ధ్యానం, యోగాయే... అందుకే భారతీయ ఋషులు ధ్యానం, యోగ మార్గాన్నే అనుసరించారు.రోజూ కనీసం అర గంట... ధ్యానం, యోగ చెయ్యండి... ఆరోగ్యంగా జీవించండని తెలిపారు. అలాగే నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటే వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. గురువులు మనలను సన్మార్గంలో నడిపించే చోదకశక్తి వంటివారు. 'మనం రోజూ జీవిస్తున్నాం అని అనుకుంటాం...కానీ మనం రోజూ కొద్దికొద్దీగా మరణిస్తున్నాం. మనకు వయసు పెరిగితే... ఆయుష్షు తగ్గినట్టా? పెరిగినట్టా?... మనం ప్రతి రోజూ... నెగెటివ్ ఎనర్జీలతో కొద్ది కొద్దిగా మరణిస్తున్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి.




# 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ విడుదల

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన నిర్మాత ప్రవీణ పరుచూరి.. ఇప్పుడు 'కొత్తపల్లిలో ఒకప్పుడు' అనే సినిమాతో, దర్శకురాలిగా, పరిచయం అవుతున్నారు. రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి రానా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా జులై 18న ఇది విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం - ట్రైలర్ విడుదల చేసింది. ఇది ఊహించని ట్విస్ట్ లతో.. నాన్ స్టాప్ కామెడితో ఆకట్టుకుంది. ఇందులో రామకృష్ణ అనే యువకుడు ఒక చిన్న పట్టణంలో డ్యాన్స్ స్టూడియో నడుపుతుంటాడు. అతను సావిత్రిని ప్రేమిస్తుంటాడు, ఆమె కూడా అతని భావాలకు స్పందిస్తున్నట్లు- కనిపిస్తుంది. ఓ రోజు సావిత్రి అతన్ని గడ్డివాము వద్ద కలవమని అడుగుతుంది. ఆనందంగా వెళ్లిన రామకృష్ణ జీవితంలో అప్పటి నుంచి భారీ మలుపు తిరుగుతుంది. ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా, ఒక అనూహ్యమైన మిస్టరీ, దైవిక సంబంధాల నడుమ నడిచే కథ గా మారుతుంది. ఇక మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రల్లో నటిస్తూ తమ పాత్రలకు స్వచ్ఛమైన అమాయకత్వాన్ని తీసుకొచ్చారు. రవీంద్ర విజయ్ కూడా తన పాత్ర ద్వారా బలమైన ప్రభావాన్ని చూపిస్తున్నారు. మొత్తానికి 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించడంలో సఫలమైంది. ఈ సినిమా జులై 18 న విడుదలకు సిద్ధమవుతుంది.






# బాహుబలి విడుదలై పదేళ్లు పూర్తి

## రాజాసాబ్‌లో ప్రభాస్ వింటేజ్ లుక్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన క్లాసిక్ మూవీ 'బాహుబలి' మొదటి భాగం విడుదలై పది సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా అభిమానులే కాకుండా, చిత్ర బృందమంతా పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయారు. అదే సమయంలో ప్రభాస్ మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. అది కూడా ఈసారి తన స్టైలిష్ లుక్ తో. ప్రస్తుతం ప్రభాస్, డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ది రాజా సాబ్' షూటింగ్ లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో మొదటి నుంచి సంబంధం ఉన్న మాస్ ప్రొడ్యూసర్ ఎస్.కె.ఎన్ తాజాగా సెట్స్ నుంచి ఓ ఫోటోను షేర్ చేయగా, అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో ప్రభాస్ కనిపించిన విధానం అభిమానుల మన్ననలు పొందుతోంది. స్టైలిష్ గా ఓ వింటేజ్ లుక్‌లో - ఓపెన్ షర్ట్, కూల్ గ్లాసెస్, లైట్ బీట్ క్రాఫ్ట్ లుక్ లో కనిపించిన ప్రభాస్ యూత్‌ఫుల్ ఎనర్జీకి ప్రతీకగా నిలిచాడు. చాలాకాలం తర్వాత ప్రభాస్‌ను ఇలాంటి మాస్ క్లాస్ లుక్‌లో చూసిన అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. ఇదే సందర్భంగా ఎస్‌కెఎన్ చేసిన వ్యాఖ్యలు కూడా ఫ్యాన్స్‌ను ఉత్సాహపరిచాయి. 'ఇది కేవలం ఓ బర్త్‌డే మూమెంట్ మాత్రమే కాదు, రాబోయే విజయం కోసం మొదటి సూచన కూడా..! ప్రస్తుతం జరుగుతున్న షూటింగ్ సన్నివేశాలు మెస్మరైజ్ చేస్తాయనడం గ్యారంటీ–' అంటూ తెలిపాడు. బాహుబలి పదేళ్లు పూర్తి చేసుకున్న స్పెషల్ రోజున ఇలా ప్రభాస్ నుంచి వచ్చిన తాజా లుక్ అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చిందని చెప్పొచ్చు.

# కార్తీ కొత్త సినిమా మార్షల్



తమిళ హీరో కార్తీ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. విభిన్న కథలతో సినిమాలు చేస్తూ తనకంటూ సెపరేట్ గుర్తింపు తెచ్చుకున్నాడు. అటు తమిళ్ తో పాటు ఇటు తెలుగులోను కార్తీ సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. కార్తీ నటించిన యుగానికి ఒక్కడు, ఖైదీ, ఊపిరి, ఆవారా, ఖాకి, సర్దార్ వంటి సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచాయి. కార్తీ సినిమా అంటే మినిమం గ్యారెంటీ- అనే అభిప్రాయం సినిమా ప్రేక్షకుల్లో ఉంది. ప్రస్తుతం సర్దార్ కు సీక్వెల్ సర్దార్ 2 తో పాటు- మరో సూపర్ హిట్ ఖైదీ కి సీక్వెల్ ఖైది 2లో నటిస్తున్నాడు కార్తీ. ఇక ఇప్పుడు మరో సినిమా చేస్తున్నాడు. కార్తీ కెరీర్ లో 29వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు 'మార్షల్' అనే టైటిల్ ను ఫిక్స్ చేస్తూ అఫీషియల్ పోస్టర్ ను రిలీజ్ చేసారు మేకర్స్. నేడు చెన్నైలో పూజా కార్యక్రమాలతో మొదలైన ఈ సినిమాకు కోలీవుడ్ సూపర్ హిట్ సినిమా తనక్కారన్ డైరెక్ట్ చేసిన యంగ్ దర్శకుడు 'తమిళ' దర్శకత్వం వహిస్తున్నాడు. యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా భారీ బడ్జెట్‌తో నిర్మించాలని ఎ÷-లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమా కథ రామేశ్వరం నేపథ్యంలో సాగుతుండడం మెజారిటి పోర్షన్ సముద్రం లొకేషన్స్ షూట్ చేయాల్సి ఉందట. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న మార్షల్ సినిమాను డ్రీమ్ వారియర్ పిచర్స్ బ్యానర్ పై ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు.




# పూజను వెన్నాడుతున్న డిజాస్టర్స్

మూవీలో హీరోయిన్ ఛాన్స్ మిస్ ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే. దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు అదరగొట్టింది. ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకొనే హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో మెప్పించింది. అరవింద సమేత వీర రాఘవ, మహర్షి, గద్దలకొండ గణేష్, హౌస్‌ఫుల్ 4, అల వైకుంఠపురంలో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలతో వరుస సక్సెస్ సాధించిన పూజా హెగ్డే ఆ తర్వాత మాత్రం హిట్ కోసం ఎంతో ఎదురు చూసింది. రాధే శ్యామ్ , బీస్ట్, ఆచార్య, సర్కస్, కిసి కా భాయ్, కిసి కీ జాన్, దేవా, రెట్రో సినిమాలు వరుసుగా ఫ్లాప్ అయ్యాయి. ఇటీ-వల వచ్చిన రెట్రో చిత్రంలో డీ గ్లామరైజ్డ్ పాత్ర పోషించగా, దీనిపై కూడా ఎన్నో ఆశలు పెట్టు- కుంది. కాని అది కూడా అభిమానులకు నిరాశను మిగిల్చింది.
తాజాగా ఆమెకు దక్కాల్సిన ఓ క్రేజీ కోలీవుడ్ ఆఫర్ మిస్ అయినట్టు- తెలుస్తుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, విగ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకునే యోచనలో ఉండగా, చివరికి ఆమె స్థానంలో మలయాళ బ్యూటీ- మమితా బైజును ఫైనల్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు, 'ప్రేమలు' సినిమా ద్వారా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా దళపతి విజయ్, సూర్య వంటి టాప్ హీరోల ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటూ, దక్షిణాది చిత్ర పరిశ్రమలో దూసుకుపోతుంది. ఇప్పుడు ధనుష్ సినిమా అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ దూసుకుపోయే ఛాన్సులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో ఆమె మార్కెట్‌లో కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలిక మేనని, ఆమె బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు. అయితే ఈ ఒక్క సినిమా మిస్ అయినా, పూజా చేతిలో ప్రస్తుతం రజనీకాంత్, విజయ్, రాఘవ లారెన్స్ లాంటి స్టార్ హీరోలతో భారీ ప్రాజెక్టులు చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్‌లతో బిజీగా ఉన్న పూజా, త్వరలోనే మళ్లీ ఫాంలోకి వస్తారని సినీ వర్గాలు

# విజయ్ సేతుపతి..మూవీ తెలుగులో సార్ మేడమ్




మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డు విన్నర్ నటి నిత్యా మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'తలైవన్ తలైవి'. ఈ సినిమాకు పాండిరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్య జ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలై 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే తమిళంలో టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను తెలుగులో సార్‌మేడమ్ పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. ఫుడ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు- తెలుస్తుంది. ఈ టీజర్‌లో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ మధ్య ఉండే కెమిస్ట్రీని చూపించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# రామయణంలో బిగ్ బి అమితాబ్ వాయిస్ ?

ప్రతిష్ఠాత్మకంగా రానున్న 'రామాయణ' సినిమాకు సంబంధించిన వీడియో ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఇందులో నటీనటుల వివరాలు ప్రకటించిన దగ్గరనుంచి సినీ ప్రముఖులు వారి అభిప్రాయాలను తెలుపుతున్నారు. మరోవైపు, ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ కూడా భాగమైనట్లు- తెలుస్తోంది. దీనిపై కథనాలు వెలువడుతున్నాయి. ఇటీవల రూపొందిన 'కల్కి 2998 ఏడీ'లో అశ్వత్థామ పాత్రలో అద్భుతమైన నటనతో ఆశ్చర్యపరిచారు బిగ్ బీ. ఇప్పుడాయన 'రామాయణ'లోనూ భాగం కానున్నట్లు- సమాచారం. ఇందులో జటాయువు పాత్రకు అమితాబ్ వాయిస్‌ఓవర్ ఇవ్వనున్నట్లు- టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇందులో రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. దీనిపై బాలీవుడ్ నటు-డు, చిత్ర నిర్మాత రాజ్ బి శెట్టి తన అభిప్రాయాన్ని తెలిపారు. యశ్ ఎంపికపై రాజ్ తన ఇన్‌స్టాలో స్పందించారు. మొదటిసారి ఒక విలన్‌ను కూడా అందరూ మెచ్చుకుంటు-న్నారని అన్నారు. యశ్ ఆ పాత్రలో వందశాతం న్యాయం చేస్తారని తెలిపారు. మనమంతా అతడి కోసం ఎదురుచూడాలని పోస్ట్ పెట్టారు. దీనిపై యశ్ స్పందించారు. 'ధన్యవాదాలు సర్. రామాయణం.. అన్ని భావాలకు అతీతమైన కావ్యం' అని రిప్లై పెట్టారు. ఈ సినిమాలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా దీని గ్లింప్స్ విడుదలైన నేపథ్యంలో రణ్‌బీర్ ఎంపికపై గతంలో ఈ సినిమా క్యాస్టింగ్ డైరెక్టర్ ముఖేశ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి వైరల్‌గా మారాయి. 'రాముడి పాత్ర పోషించాల్సినవారికి ఉండాల్సిన ప్రధాన లక్షణం ప్రశాంతత. రణ్‌బీర్ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. అందుకే నితేశ్ తివారీ అందరికంటే అతడిని ముందుగా ఎంపిక చేశారు. రాముడిగా రణ్‌బీర్ ఎంపిక సరైనదని సినిమా చూశాక ప్రేక్షకులకు కచ్చితంగా అర్థమవుతుంది. నటనలో ఆయనతో ఎవరూ పోటీ- పడలేరు. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ ఒకేలా ఉంటాడు' అంటూ రణ్‌బీర్‌పై ముఖేశ్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ కనిపించనున్నారు. రావణుడి సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించే అవకాశం ఉందని సమాచారం. రెండు భాగాలుగా ఇది రానుంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానుంది. సుమారు రూ.1600 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది.



Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,